ఉష్ణోగ్రత గురువారం గరిష్ఠం : 32.0 కనిష్ఠం : 18.0

ఆంధ్రజ్యోతి

5

అనంతపురం

జిల్లా వార్తలు

శుక్రవారం 14 నవంబరు 2025





నారాయణ సేవలో పాల్గొన్న భక్తులు, అలంకరణలో బాబా మహా సమాధి

సాయి నారాయణా..!



సత్యసాయి శత జయంతి వేడుకలు ప్రారంభం

- మహా సమాధికి ప్రత్యేక అలంకరణ.. పూజలు
- బెంగళూరు బృందావనం నుంచి సైకిల్ యాత్ర
- ప్రశాంతి నిలయంలో అలరించిన ప్రదర్శనలు
- నారాయణ సేవను ప్రారంభించిన ఆర్‌జే రత్నాకర్

పుట్టపర్తి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): భక్తులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సత్యసాయి శత జయంతి వేడుకలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రశాంతి నిలయంలో సత్యసాయి విద్యార్థులు సత్యసాయి మహాసమాధిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. విద్యార్థుల వేద పఠనంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. వేడుకల్లో పాల్గొంటున్న భక్తులకు నారాయణ సేవను సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ ప్రారంభించారు. ఈ నెల 24 వరకు 12 రోజుల పాటు సాగే నారాయణ సేవ కోసం 200 మంది వంట మనుషులు, 500 మంది సహాయకులు సేవలు అందిస్తారు. శత జయంతి ఉత్సవాల గ్యాస్ బెలూన్‌ను రత్నాకర్ ఎగురవేశారు.

భక్తి నివేదన

సైక్లోన్ సభా మండపంలో సాయంత్రం అనిర్బాన్ రాయ్ ఫ్లూట్ వాయిద్యం, సత్యసాయి హయ్యర్ సెకండరీ స్కూల్ విద్యార్థులు సంగీత, సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను అలరించాయి. వేలాది మంది భక్తులు సత్యసాయి సమాధిని దర్శించుకున్నారు. సత్యసాయి శత జయంతి వేడుకలకు బెంగళూరులోని బృందావన క్యాంపస్ విద్యార్థులు 150 మంది సైకిల్ యాత్రతో భక్తి నివేదనను చాటారు. వంద మైళ్ల దూరం సైకిళ్లపై ప్రయాణించి గురువారం సాయంత్రానికి ప్రశాంతి నిలయానికి చేరుకున్నారు. హిల్‌వ్యూ స్టేడియంలో సత్యసాయికి మంగళహారతి ఇచ్చి, యాత్రను ముగించారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ రాఘవేంద్ర ప్రసాద్, రిజిస్ట్రార్ శ్రీకాంత్ ఖన్నా, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

నేడు ప్రశాంతి నిలయంలో..

సత్యసాయి జయంతి వేడుకల్లో రెండో రోజు శుక్రవారం సాయికుల్వంత్‌లో కుమారి రూప సితారు వాయిద్య ప్రదర్శన ఉంటుంది. భక్తులకు నారాయణసేవ కొనసాగుతుంది. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

విలువలే పాఠాలుగా..!
- సత్యసాయి విద్యాసంస్థలు దేశానికే తలమానికం

పోలీసు పహారాలో...
- పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్న పోలీసులు

6

ఏం చేద్దాం తమ్ముళ్లూ..?



నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, పరిశీలకులతో చర్చిస్తున్న ప్రత్యేక పరిశీలకుడు, ఎమ్మెల్సీ భూమిరెడ్డి

- సుదీర్ఘంగా శింగనమల పదవుల పంచాయితీ
- అధినాయకత్వం తరఫున భూమిరెడ్డి హాజరు
- ఎమ్మెల్యే, కీలక నాయకుల సమక్షంలో చర్చలు
- నాలుగు మండలాలు కొలిక్కి..?
- ఏకాభిప్రాయం కుదరకపోతే ఐవీఆర్‌ఎస్..?

అనంతపురం క్రైం, బుక్కరాయసముద్రం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): శింగనమల నియోజవకర్గంలో తెలుగుదేశం పార్టీ పదవుల కేటాయింపునకు సుదీర్ఘ చర్చ జరిగింది. పార్టీ మండల కమిటీలు, ఆలయ కమిటీల ఏర్పాటు వివాదాస్పదంగా మారడంతో అధినాయకత్వం ప్రత్యేక పరిశీలకుడిగా ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డిని పంపింది. అనంతపురంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఎమ్మెల్యే బండారు శ్రావణి, ద్విసభ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి, ఆలం నరసానాయుడు, నియోజకవర్గ పరిశీలకులు పర్వీన్‌తాజ్, కాటమయ్య, మండల పరిశీలకులు కూచి హరి, ఏలూరి రంగయ్య, కుంచెం వెంకటేషు, గోళ్ల వెంకటేష్, మల్లికార్జునప్ప, వీరేష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ భూమిరెడ్డి సుదీర్ఘంగా చర్చించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఉత్కంఠగా చర్చలు జరిగాయి. మండల కన్వీనర్ల ఎంపిక విషయంలో ఐదు మండలాల టీడీపీ ముఖ్యనేతలు, ఆశావహులను పిలిపించి మాట్లాడారు. ఎంపికపై వారి సలహాలు, సూచనలను తీసుకున్నారు.

కొలిక్కి వచ్చిందా..?

మండల కన్వీనర్లు, ప్రధాన కార్యదర్శులు, క్లస్టర్ పోస్టులను ఎవరికి ఇవ్వాలనే అంశంపై సమావేశంలో అందరి అభిప్రాయాలను భూమిరెడ్డి తీసుకున్నట్లు తెలుస్తోంది. పార్టీలో ఎవరెవరు కష్టపడ్డారు, ఏ పోస్టులకు ఎవరు అర్హులు అనే అంశాలను ఆయన పూర్తి డేటాతో వివరించినట్లు సమాచారం. అయితే, నియోజకవర్గ నాయకుల అభిప్రాయాన్ని కూడా పరిగణనలోకి తీసుకుని, ఏం చేయాలనే అంశంపై తుది నిర్ణయానికి వచ్చారని తెలిసింది. గార్లదిన్నె, నార్పల, యల్లనూరు, పుట్లూరు మండలాల పోస్టుల విషయం ఒక కొలిక్కి వచ్చినట్లు తెలిసింది. శింగనమల మండల కన్వీనర్ పోస్టుకు పోటీ ఉన్నా.. సాయంత్రానికి కొలిక్కి వచ్చినట్లు సమాచారం. బుక్కరాయసముద్రం మండల కన్వీనర్ పోస్టుపై కసరత్తు కొనసాగుతోందని తెలిసింది.

అడ్డుకున్న పోలీసులు

పార్టీ నాయకులకు తమ అభిప్రాయాన్ని చెప్పేందుకు వచ్చిన ఇద్దరిని ఆర్ అండ్ బీ అతిథి గృహం వద్ద పోలీసులు అడ్డుకున్నారు. శింగనమల మండలం సలకంచెరువుకు చెందిన అగ్రహారం బాలకృష్ణ, గార్లదిన్నె మండలానికి చెందిన కనంపల్లి ప్రసాద్ గెస్ట్‌హౌస్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. అప్పటికే అక్కడికి చేరుకున్న గార్లదిన్నె, బుక్కరాయసముద్రం పోలీసులు వారిని బలవంతంగా స్టేషన్‌కు తరలించారు.

ఐవీఆర్‌ఎస్‌కు వెళతారా..?

శింగనమల, పుట్లూరు మండలాలకు తీవ్ర పోటీ నెలకొంది. దీంతో ఈ రెండు మండలాలకు ఐవీఆర్‌ఎస్ ద్వారా కన్వీనర్‌లను ఎంపిక చేయాలనే చర్చ జరిగినట్లు తెలిసింది. శింగనమల మండలంలో మారుతీనాయుడు, అనిల్ కుమార్ యాదవ్ మధ్య తీవ్రపోటీ నెలకొంది. ఈ రెండు వర్గాల మధ్య గతంలో ఘర్షణ జరిగింది. పుట్లూరు మండలంలో సుదర్శన్ నాయుడు, ఓబులాపురం శీనా, కులశేఖర్‌రెడ్డి బరిలో ఉన్నారు. యల్లనూరు మండలానికి రామాంజినేయులు పేరు దాదాపు ఖరారు చేసినట్లు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. ఇక్కడ కూడా పోటీ పెరిగితే ఐవీఆర్‌ఎస్‌కు వెళతారని సమాచారం.

బీకేఎస్.. పెద్దల వద్దే ఫైనల్..?

బుక్కరాయసముద్రం మండల కన్వీనర్ ఎంపిక విషయంలో పార్టీ అధినాయత్వమే నిర్ణయం తీసుకుంటుందని తెలిసింది. ఈ మండల నాయకులను గురువారం అభిప్రాయ సేకరణకు పిలవలేదు. మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ, రేగడి కొత్తూరుకు చెందిన ఈశ్వరయ్య ముందు నుంచి బరిలో ఉన్నారు. ఈ మండలంలో పార్టీపరంగా పలు సమస్య లు ఉన్నాయని, వాటిని పరిష్కరించే దిశగా మండలంలోని ముఖ్యనేతలను విజయవాడకు పిలిపించి మాట్లాడే అవకాశం ఉందని తెలిసింది.

తీర్పు వచ్చేదాకా ఆగండి..!

- హుండీ లెక్కింపును అడ్డుకున్న పూజారి కుటుంబం
- శివపురం పెద్దమ్మ ఆలయం వద్ద రెండు గంటలపాటు ఉద్రిక్తత



సీఐతో ఆలయ పూజారి కుటుంబసభ్యుల వాగ్వాదం

శింగనమల, నవంబరు13(ఆంధ్రజ్యోతి): మండలంలోని శివపురం పెద్దమ్మ ఆలయం హుండీ లెక్కింపుపై గురువారం వివాదం రేగింది. దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఉన్న ఈ ఆలయానికి సంబంధించి ప్రతి మూడు నెలలకు ఒకసారి హుండీ ఆదాయం లెక్కించాల్సి ఉంది. అయితే వివాదం కోర్టులో ఉందని, అక్కడి నుంచి స్పష్టమైన తీర్పు వచ్చే వరకు లెక్కించరాదని పూజారి కుటుంబం ప్రతిసారి అడ్డుకుంటోంది. ఆలయానికి సంబంధించి 8 నెలల హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించేందుకు దేవదాయ శాఖ అధికారులు నోటీస్ జారీ చేశారు. అక్కడికి వెళ్లిన అధికారులు, పోలీసు యంత్రాంగంతో హుండీ లెక్కింపు చేయరాదని పూజారి కుటుంబం వాగ్వాదానికి దిగింది. దీంతో రెండు గంటలు పాటు ఆలయం వద్ద ఉద్రిక్తత నెలకొంది. ఆలయ వివాదంలో కోర్టులో నడుస్తోందని, 15 రోజులు గడువు ఇవ్వాలని పూజారి కుటుంబం కోరడంతో అధికారులు అనుమతి ఇచ్చి హుండీ లెక్కింపు వాయిదా వేశారు.

స్వార్థ ప్రయోజనం కోసమే: ఈఓ

పూజారి కుటుంబం స్వార్థ ప్రయోజనం కోసం హుండీ లెక్కింపు, ఆలయ అభివృద్ధిని అడ్డుకుంటోందని దేవదాయ శాఖ ఈఓ రంగస్వామి, రీజనల్ ఇన్‌స్పెక్టర్ వన్నూర్‌స్వామి గుర్రప్ప తెలిపారు. శింగమలలో వారు విలేకరులతో మాట్లాడుతూ 2022లో పెద్దమ్మ గుడి దేవదాయ శాఖ పరిధిలోకి వచ్చిందన్నారు. ఇది తమ కుటుంబానికే సొంతమని అప్పట్లోనే గుడి పూజారి కోర్టుకు వెళ్లారని, అప్పటి నుంచి కేసు నడుస్తూనే ఉందన్నారు. ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం రూ.77 లక్షలు మంజూరు చేసిందన్నారు. అయితే అభివృద్ధి పనులు జరగకుండా పూజారి కుటుంబ సభ్యులు అడ్డుకుంటున్నారని తెలిపారు. కోర్టు తీర్పు వారికి అనుకూలంగా వస్తే గుడిని అప్పగించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

కోర్టు తీర్పు వచ్చే వరకు...

మా సొంత గుడిని మాకే ఇవ్వాలని 2022లో కోర్టుకు వెళ్లాం. అప్పటి నుంచి ఇప్పటి వరకు కోర్టులో వాదనలు జరుగుతున్నాయి. అయితే దేవదాయశాఖ అధికారులు ప్రతి మూడు నెలలకు ఒక సారి వచ్చి హుండీ లెక్కింపులు జరుపుతున్నారు. కోర్టు తీర్పు వచ్చే వరకు లెక్కింపు చేయవద్దని కోరుతున్నాం.

- పూజారి కుటుంబ సభ్యులు

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు



గ్రంథాలయ వారోత్సవాలకు జేసీని ఆహ్వానిస్తున్న కార్యదర్శి రమ, ఉద్యోగులు

అనంతపురం విద్య, నవంబరు13(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాలు శుక్రవారం నుంచి ఈనెల 20వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆమె గురువారం వెల్లడించారు. జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని ఏటా వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమకారులను స్మరించుట, 17న కవిసమ్మేళనం, 18న పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు, 19న ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా మహిళాదినోత్సవం, 20న విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. వారోత్సవాలకు జేసీ శివనారాయణ శర్మను ఆహ్వానించారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ కమ్మన్న, అసిస్టెంట్ లైబ్రేరియన్ గోవింద్ పాల్గొన్నారు.

నిధుల స్వాహాపై విచారణ

- రంగంలోకి స్టేట్ ఆడిట్ బృందం
- తొలిరోజు బ్యాంక్ లావాదేవీలపై ఆరా
- పశుసంవర్ధక శాఖలో కలకలం

అనంతపురం అర్బన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధక శాఖలో రూ.కోటికిపైగా నిధుల స్వాహాపై స్టేట్ ఆడిట్ బృందం అధికారులు గురువారం విచారణ చేపట్టారు. తొలి రోజు స్టేట్ ఆడిట్ బృందం అధికారులు సత్యనారాయణ, చక్రధర్, గంగాశంకర్‌లు పశుసంవర్ధక శాఖ జేడీ ప్రేమ్‌చంద్‌తో సమావేశమయ్యారు. డిపార్టుమెంట్ ఖాతా నుంచి అనధికారికంగా సొమ్ము డ్రాపై ఆరా తీశారు. సంబంధిత విభాగంలోని ఓ సీనియర్ అసిస్టెంట్ సెలవులో ఉండగా డిపార్టుమెంట్ ఖాతాకు సంబంధించిన బ్యాంక్ లావాదేవీల ఫైళ్లు ఉన్న బీరువా తాళాలు తెప్పించుకున్నారు.

సొమ్ము స్వాహాపై కూపీ

పశుసంవర్ధక శాఖలో వివిధ పథకాలకు సంబంధించిన డిపార్టుమెంట్ ఖాతాలోని సొమ్మును గతంలో ఇక్కడ పనిచేసిన ఓ జేడీ, కొందరు విభాగంలోని సిబ్బంది కుమ్మక్కై కాజేశారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇందులో ఎక్కువ మొత్తంలో జేడీ స్థాయి అధికారి తమ కుటుంబ సభ్యుల ఖాతాల్లోకి మళ్లించినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్టేట్ ఆడిట్ బృందం అధికారులు తొలి రోజు సొమ్ము స్వాహా ఎలా జరిగిందన్న అంశానికి సంబంధించిన అన్ని ఫైళ్లు, బ్యాంక్ లావాదేవీలు, ఓచర్స్, పలు బిల్లులను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. మరో రెండు రోజులపాటు క్షుణ్ణంగా నిధుల స్వాహాపై లోతుగా విచారించి, కూపీ లాగనున్నట్లు సమాచారం. తొలి రోజే సొమ్ము స్వాహా జరిగిన విషయాన్ని ఆడిట్ బృందం పసిగట్టినట్లు తెలిసింది. మరో రెండు రోజుల పరిశీలనలో వాస్తవాలు బహిర్గతం అయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఆ శాఖలోని కొందరు ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

తప్పించుకునేందుకు పన్నాగాలు

డిపార్టుమెంట్ నిధులు కాజేసిన గతంలో ఇక్కడ పనిచేసిన జేడీ తాను తప్పించుకొని, కొందరు సిబ్బందిని బలిచేసేందుకు పన్నాగాలు పన్నుతున్నట్లు సమాచారం. అసలే వివాదాస్పద అధికారిగా పేరొందిన ఆ విశ్రాంత ఉన్నతాధికారి ప్రస్తుతం పనిచేస్తున్న కొందరు అధికారులు, సిబ్బందిని టార్గెట్ చేసి, తన సన్నిహితుల ద్వారా హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిసింది. దీంతో ఆ శాఖలోని కొందరు అధికారులు ఆయన ఏ ముప్పుతెచ్చిపెడతారోనని ఆందోళన చెందుతున్నారు. కాగా సొమ్ముస్వాహాపై నిజాలు నిగ్గుతేలితే బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసే అవకాశం ఉంది. విశ్రాంత అధికారులు ఈ వ్యవహారంలో ఉంటే.. వారిపైనా క్రిమినల్ కేసులతోపాటు వారికి ప్రభుత్వం నుంచి అందుతున్న బెనిఫిట్స్ ఆపే అవకాశం ఉంటుందన్న వాదనలు వినిపిస్తున్నాయి.



పశుసంవర్ధక శాఖ జేడీ ప్రేమ్‌చంద్‌తో సమావేశమైన ఆడిట్ బృందం అధికారులు

ముగిసిన ఈ పంట నమోదు

రైతు సేవాకేంద్రంలో ముసాయిదా జాబితా ప్రదర్శన

అనంతపురం అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ ఈ పంట నమోదు ప్రక్రియ గురువారంతో ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 19.01 లక్షల ఎకరాల విస్తీర్ణంలో ఈ పంట నమోదు చేశారు. ఇందులో వ్యవసాయ శాఖ పరంగా పంటలు 8.64 లక్షలు, ఉద్యానశాఖ పరంగా 3.14 లక్షలు, సెరికల్చర్ 1,281, వ్యవసాయేతర భూములు 7.21 లక్షల ఎకరాలను నమోదు చేశారు. సామాజిక తనిఖీలో భాగంగా జిల్లాలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఈ పంట నమోదుకు సంబంధించిన ముసాయిదా జాబితాను ప్రదర్శిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ పేర్కొన్నారు. ఈనెల 17వ తేదీదాకా రైతు సేవాకేంద్రాల్లో జాబితాను సామాజిక తనిఖీ కోసం ఉంచుతామన్నారు. ఈ పంట నమోదు వివరాలను స్థానిక సిబ్బంది చదివి వినిపిస్తారన్నారు. రైతులు అభ్యంతరాలుంటే రాతపూర్వకంగా అందజేస్తే, పరిష్కరిస్తామన్నారు. ఈ పంట నమోదు సవరణకు ఇదే తుది అవకాశమనీ, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



యాడికి రైతు సేవాకేంద్రంలో ఈ పంట నమోదు తుది జాబితాను ప్రదర్శిస్తున్న దృశ్యం

ఆ సీటు వద్దే.. వద్దు..!

ప్రభుత్వ కార్యాలయాల్లో మెరుగైన క్యాడర్ కోసం అధికారులు, ఉద్యోగులు ఆరాట పడుతుంటారు. ఇన్‌చార్జి, ఎఫ్‌ఏసీ కోసం సిఫార్సులు తెచ్చుకుంటుంటారు. సర్వశక్తులూ ఒడ్డుతుంటారు. యాడికి ఎంపీడీఓ కార్యాలయంలో ఇటీవల సీటు కోసం మాటల ఫైటే జరిగింది. ఆ సీటు కావాలని వాదులాడుకున్నారను కుంటే తప్పులో కాలేసినట్లు. సీటు వద్దని వాగ్వాదం చేసుకున్నారు. ఆఫీసులో సీనియర్ అసిస్టెంట్ సీటు ఏడాదిగా ఖాళీగా ఉంది. ఏడాది క్రితం ఇక్కడ సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న హనుమంతరెడ్డి అనంతపురం జడ్పీకి డెప్యుటేషన్‌పై వెళ్లిపోయారు. ఆ స్థానంలో ఎవ్వరినీ నియమించలేదు. తర్వాత కొన్ని రోజులకు కార్యాలయ ఏఓ నాగేశ్వర్‌రెడ్డి ఇన్‌చార్జి బాధ్యతలు తీసుకున్నారు. మూడు వారాల క్రితం ఆయన డెప్యుటేషన్‌పై గుంతకల్లుకు వెళ్లిపోయారు. దీంతో ఆ సీటు ఖాళీగా ఉంది. సీనియర్ అసిస్టెంట్ లేక పనులు జాప్యమవుతున్నాయి. ఆ సీటులోకి రావాలని ఇన్‌చార్జి బాధ్యతలు తీసుకోవాలని ఆఫీసులోనే ఉన్న జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న రాఘవేంద్రకు ఎంపీడీఓ ఇటీవల సూచించారు. ఆనందంగా ఆ సీటులో చేరిపోవాల్సిన ఆయన.. ససేమిరా అన్నారు. వచ్చి తీరాల్సిందేనని ఎంపీడీఓ ఒత్తిడి చేసినట్లు తెలిసింది. తనకు ఆ సీటు వద్దే వద్దంటూ.. జూనియర్ అసిస్టెంట్ తెగేసి చెప్పినట్లు చర్చ సాగుతోంది. ఇలా.. మాటల యుద్ధమే నడిచిందని కార్యాలయ వర్గాల సమాచారం. ఆఖరుకు జూనియర్ అసిస్టెంట్ సెలవులో వెళ్లిపోయారు. సీనియర్ అసిస్టెంట్ సీటు అంటే ఎందుకు అంతలా బెంబేలెత్తిపోతున్నారంటే అందుకు కారణం లేకపోలేదు. గతంలో ఆ స్థానంలో పనిచేసిన వారు బిల్లుల చెల్లింపుల్లో పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. వారి పాపాలు తమ మెడకు ఎక్కడ చుట్టుకుంటాయోనని ఆ సీటులోకి రావడానికి ఇతరులు జంకుతున్నట్లు సమాచారం. దీనిపై ఎంపీడీఓ వీరరాజును అడగ్గా.. జూనియర్ అసిస్టెంట్ సెలవు పెడుతున్నట్లు సిబ్బంది చెప్పారన్నారు. లీవ్‌లెటర్‌ను మెయిల్ ద్వారా పంపిస్తానని చూపినట్లు తెలిసిందన్నారు. ఇక, సీనియర్ అసిస్టెంట్ సీటులోకి ఎవరొస్తారో.. ఏమో..

- యాడికి, ఆంధ్రజ్యోతి



ఖాళీగా ఉన్న సీనియర్ అసిస్టెంట్ కుర్చీ

నేటి ఎస్‌ఏ-1 పరీక్ష వాయిదా: డీఈఓ

6లో..

అనుమానంతో హత్య

- బెళుగుప్పలో భార్యను నరికేసిన భర్త
- పోలీస్ స్టేషన్‌లో లొంగుబాటు



వివరాలు మెయిన్‌లో..

చిన్న సారు పెత్తనం..!

- అసోసియేషన్ ముసుగులో చిరుద్యోగి హవా
- తాడిపత్రి సర్కిల్‌లో స్క్రాప్, గ్రానైట్, లారీ తనిఖీలతో మామూళ్లు
- ఉన్నతాధికారికీ ముడుపులు?
- జూనియర్ అసిస్టెంట్, అటెండర్‌లే వసూల్ రాజాలు



పన్నుల శాఖలో చోద్యం

6లో..



భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్, ఏఎస్పీ అంకిత మహావీర్

పోలీసు పహారాలో పుట్టపర్తి

- బాబా శతజయంతికి హాజరుకానున్న రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధాని
- పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్న పోలీసులు

పుట్టపర్తిరూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పోలీసు పహారాలో పుట్టపర్తి కొనసాగుతోంది. సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలకు దేశంలోని ప్రముఖులు హాజరవుతున్న నేపథ్యంలో పుట్టపర్తిలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈనెల 19న భారత ప్రధాని నరేంద్రమోదీ, 22, 23 తేదీల్లో రాష్ట్రపతి ద్రౌపదిముర్ము, ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ పుట్టపర్తికి రానున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎస్పీ సతీష్‌కుమార్ పర్యవేక్షణలో వారం రోజులుగా పట్టణంలో అణువణువు తనిఖీ చేస్తున్నారు. అత్యాధునిక కెమెరాలు, డ్రోన్లు, నైట్ విజన్ పరికరాలతో ద్వారా రాత్రిపూట నిఘా కొనసాగుతోంది. పట్టణంలోని ప్రధాన రహదారులు, ప్రవేశద్వారాలు, విమానాశ్రయం, హెలీప్యాడ్, ప్రశాంతినిలయం, సాయికుల్వంత్ సభామండపం, హిల్‌వ్యూ స్టేడియం ప్రాంతాల్లో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రేహౌండ్స్ స్పెషల్‌పార్టీ పోలీసులు, బాంబ్‌స్క్వాడ్, డాగ్‌స్క్వాడ్, సాయుధబలగాలతో ప్రత్యేక నిఘా ఏర్పాట్లు జరుగుతున్నాయి. పట్టణంలోకి వచ్చే వాహనాలపై చెకింగ్ పాయింట్ల వద్ద తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్రధాన వీధులు, వీఐపీ మార్గాలపై పోలీసులు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ గురువారం మాట్లాడుతూ వీవీఐపీల భద్రతను దృష్టిలో ఉంచుకుని పటిష్ట బందోబస్తు చర్యలను చేపడుతున్నామన్నారు. సత్యసాయి జయంతి వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ తరపున కృషి చేస్తున్నట్లు తెలిపారు.

విలువలే పాఠాలుగా..!

- మానవత్వం, సేవ, క్రమశిక్షణకు ప్రాధాన్యం
- కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య
- సత్యసాయి విద్యాసంస్థలు దేశానికే తలమానికం



శ్రీసత్యసాయి హయ్యర్ సెకండరీ స్కూల్

పుట్టపర్తి రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): భూమిపై నడయాడిన భగవంతుడిగా కీర్తి గడించిన సత్యసాయి బాబా విద్యకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చారు. అక్షరమే విజ్ఞాన సాధనమని భావించి దశాబ్దాల కిందటే విద్యాసంస్థల ఏర్పాటుకు పునాది రాయి వేశారు. విలువలే పాఠాలుగా విద్య అందించాలని ఓ నూతన విద్యా వ్యవస్థను రూపొందించారు. ఈ విద్యా సంస్థల్లో మానవత్వం, సేవ, క్రమశిక్షణను పాఠ్యాంశాలకు జతగా బోధిస్తూ దేశానికే తలమానికంగా తీర్చిదిద్దారు. ఆధునిక విద్యావ్యవస్థలో ఎన్ని మార్పులొచ్చినా.. ఎన్ని విపరీత పోకడలు వచ్చినా, సత్యసాయి విద్యావిధానంలో నేటికీ విలువలే ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి. ఇక్కడ కేజీ నుంచి పీజీ వరకు పూర్తి ఉచితంగా విద్య బోధిస్తున్నారు.



శ్రీసత్యసాయి డీమ్డ్ యూనివర్శిటీ భవనం

1981లో ప్రారంభం

భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, మానవతా విలువలను మేళవించి నాణ్యమైన విద్యాప్రమాణాలను అందించడంలో సత్యసాయి విశ్వవిద్యాలయం విశిష్టస్థానం సంపాదించింది. 1981లో సత్యసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ (శ్రీసత్యసాయి యూనివర్సిటీ) స్థాపించారు. విశ్వవిద్యాలయం పరిధిలో ప్రశాంతినిలయం, అనంతపురం మహిళా కళాశాల, బెంగళూరులోని బృందావనం, నందగిరి ప్రాంగణం ఉన్నాయి. సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీకి 1986లో ఇండియన్ యూనివర్సిటీ అసోసియేషన్‌లో శాశ్వత సభ్యత్వం లభించింది. 2002లో నాక్ ఏ++గ్రేడ్ ఇచ్చి దేశంలోనే ఉన్నత విద్యాలయాల సరసన చేర్చింది. 2009లో శ్రీసత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీగా అవతరించింది.

ప్రవేశం ఇలా..

విశ్వవిద్యాలయ ప్రవేశానికి రాత, మౌఖిక, లాటరీ విధానాల్లో విద్యార్థులను ఎంపిక చేస్తారు. డిసెంబరు మొదటివారం నుంచి ఫిబ్రవరి చివరి వారం వరకు దరఖాస్తులు అందజేస్తారు. మార్చి చివరి నాటికి దరఖాస్తులు అందజేయాల్సి ఉంటుంది. ఏప్రిల్ రెండోవారంలో రాతపరీక్షలు, లాటరీ నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేస్తారు. జూన్ మొదటివారంలో ప్రవేశాలు కల్పిస్తారు. జూన్ 10 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.

వస్త్రధారణ, పరిశోధనలు, క్రీడలకు పెద్దపీట

సత్యసాయి విద్యాసంస్థల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. సంప్రదాయ వస్త్రధారణ, క్రమశిక్షణతో కూడిన నడవడిక, నిత్యపరిశోధన, సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలకు పెద్దపీట వేస్తున్నారు. కంప్యూటర్ శిక్షణ, అత్యాధునిక పరిశోధన, యోగా కేంద్రాలు, లక్షలాది పుస్తకాలతో కూడిన అత్యాధునిక లైబ్రరీ సత్యసాయి విద్యాసంస్థల సొంతం. విద్యార్థులకు సాహస క్రీడల్లో తర్ఫీదు ఇస్తున్నారు. ఏటా జనవరి 11న నిర్వహించే సాంస్కృతిక క్రీడోత్సవంలో ప్రదర్శించే సాహసోపేతమైన విన్యాసాలు ఆహూతులను అబ్బురపరుస్తాయి.



శ్రీసత్యసాయి పీజీ కళాశాల

ఇవీ కోర్సులు

యూజీ విభాగంలో బీఎస్సీ ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఫైనాన్స్, ఎకనామిక్స్, డేటా సైన్స్, ఫుడ్ అండ్ న్యూట్రిషన్, బీఏలో హానర్స్ ఇన్ ఎకనామిక్స్, బీకాంలో బీకాం హానర్స్, బీబీఏ బీఈడీ కోర్సులున్నాయి. పీజీలో ఎంబీఏ రెండు సంవత్సరాల ప్రోగ్రాం, ఎమ్మెస్సీ మ్యాథమాటిక్స్, ఫిజిక్స్ కంప్యూటర్ సైన్స్, బయోసైన్స్, ఎంటెక్‌లో అప్లైడ్ ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్, కంప్యూటర్ సైన్స్, ఎంఏ ఇంగ్లిష్, ఇంగ్లిష్ లిటరేచర్, పీహెచ్‌డీ కోర్సులున్నాయి.

ఉన్నతస్థాయికి ఎందరో విద్యార్థులు

సత్యసాయి విద్యాసంస్థల్లో చదివిన విద్యార్థులు దేశవిదేశాల్లో వివిధ రంగాల్లో ఉన్నత స్థానంలో స్థిరపడ్డారు. ఇక్కడ నేర్చుకున్న క్రమశిక్షణ, విలువలు, గురువులు బోధనలే తమను ఉన్నత స్థానంలో నిలిపినట్లు పలువురు పూర్వ విద్యార్థులు చెబుతున్నారు. ప్రముఖ సినీ నటుడు విజయ దేవరకొండ, ఆయన సోదరుడు సత్యసాయి విద్యాసంస్థల్లో చదువుకున్న వారే.

నాటి గొల్లపల్లియే.. నేటి పుట్టపర్తి





ఒకనాటి గొల్లపల్లి గ్రామమే నేటి పుట్టపర్తి పట్టణం. ఒకప్పుడు గొల్లపల్లిలో గోపాలకులు ఎక్కువగా ఉండటంతో గొల్లపల్లిగా పిలిచేవారు. ప్రచారంలో ఉన్న కథ ప్రకారం గోపాలకులు తమ పాడి ఆవులను మేతకోసం అడవికి తీసుకొని వెళ్లేవారు. ఒక ఆవు మాత్రం ప్రతి రోజు మంద నుంచి తప్పించుకుని అడవిలో మరో చోటుకు వెళ్లేది. అక్కడ ఉన్న పుట్ట వద్ద నిలబడి ఓ పాముకు పాలిచ్చేది. సాయంత్రం ఇంటికి వచ్చాక అది పాలివ్వకపోవడంతో యానిమానికి అనుమానం వచ్చింది. దీంతో ఆయన రహస్యంగా ఆ ఆవు వెంట వెళ్లాడు. యథాప్రకారం ఆ ఆవు ఓ పుట్టవద్దకు వెళ్లి పాముకు పాలివ్వడం ప్రారంభించింది. దీన్ని గమనించిన యజమాని కోపంతో ఆవును కొట్టబోయి పామును కొట్టాడు. దీంతో పాము రక్తసిక్తమయింది. దాని పాపమో, శాపమో గాని అప్పటి నుంచి గోపాలవంశం నశించిపోయింది. పాము చనిపోయిన తర్వాత గొల్లపల్లి గ్రామమంతా పుట్టలు వెలిశాయి. దీంతో ఆ గొల్లపల్లి కాలక్రమేణ పుట్టపర్తిగా మారింది. చిన్న గ్రామంగా ఉన్న పుట్టపర్తి సత్యసాయి బాబా అవతరించడంతో ప్రపంచ ఆధ్యాత్మిక నగరంగా మారింది.

● ఆంధ్రజ్యోతి, పుట్టపర్తి

నేటి ఎస్‌ఏ-1 పరీక్షలు వాయిదా: డీఈఓ



అనంతపురం విద్య, నవంబరు13(ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవం నేపథ్యంలో శుక్రవారం నిర్వహించాల్సి ఎస్‌ఏ-1 సైన్స్ పరీక్షలు వాయిదా వేసినట్లు డీఈఓ ప్రసాద్‌బాబు తెలిపారు. తన కార్యాలయంలో పరీక్షకు సంబంధించిన వివరాలను డీఈఓ వెల్లడించారు. శుక్రవారం 3,4,5 తరగతులకు ఈవీఎస్, 6నుంచి పదో తరగతి వరకు నిర్వహించాల్సిన జనరల్ సైన్స్, ఫిజికల్ సైన్స్ పరీక్షలను వాయిదా వేసినట్లు తెలిపారు. వాయిదా పడిన పరీక్షలు 3,4,5 తరగతులకు ఈనెల 17న, 6నుంచి పదో తరగతి వరకు ఈనెల 20న నిర్వహించాలన్నారు. అంతవరకు ప్రశ్నాపత్రాలను భద్రంగా ఉంచుకోవాలన్నారు. వీటిపై ఎంఈఓలు, హెచ్‌ఎంలదే బాధ్యత అన్నారు.

22న క్లస్టర్ సమావేశాలు

క్లసర్ సమావేశాలు ఈనెల 22న నిర్వహించనున్నట్లు డీఈఓ తెలిపారు. గతంలో ఎస్‌జీటీలు, స్కూల్ అసిస్టెంట్స్ ఆయా క్లస్టర్ స్కూల్‌లో సమావేశాలకు హాజరయ్యేవారన్నారు. అయితే ఇపుడు ఎస్‌జీ టీచర్లు మాత్రమే క్లస్టర్ స్కూళ్లలో మీటింగ్‌లకు హాజరుకావాల్సి ఉంటుంది. అన్ని స్కూల్ అసిస్టెంట్ కేడర్లకు మండల కేంద్రంలోనే క్లస్టర్ సమావేశాలు ఉంటాయన్నారు. ఎస్‌ఏలు, పీడీలందరూ ఆ మండల కేంద్రంలోనే హాజరుకావాల్సి ఉంటుందన్నారు.

పది విద్యార్థులకు వంద రోజుల ప్రణాళిక

ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదోతరగతి విద్యార్థుల వంద శాతం ఉత్తీర్ణత కోసం డిసెంబరు 6 నుంచి వందరోజుల ప్రణాళిక ప్రారంభిస్తామని డీఈఓ తెలిపారు. ఆమేరకు ఉపాధ్యాయులు పదో తరగతి పాఠ్యాంశాలను డిసెంబరు 5కే పూర్తిచేసేలా ఎంఈఓలు, హెచ్‌ఎంలు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులందరికీ యుడైస్‌లో డేటా ఎంట్రీ పూర్తిచేయాలన్నారు. విద్యార్థుల ఫొటోలు, గుర్తింపు చిహ్నాలు (పుట్టుమచ్చలు) తల్లిదండ్రుల పేర్లు, ఆధార్ నెంబర్లు అన్ని వివరాలు యుడైస్‌లో తప్పులు లేకుండా ఉండేలా చూసుకోవాలన్నారు. యుడైస్‌లో ఏ వివరాలు ఉంటాయో పదో తరగతి మార్కుల మెమోలో అలాగే వస్తాయని అందుకే ఒకటికి రెండుసార్లు పరిశీలించుకొని తప్పులు లేకుండా నమోదు చేయాలని డీఈఓ కోరారు.

మా ప్రాణం మీరే..

- కార్యకర్తలను ఉద్దేశించి ఎమ్మెల్యే సునీత
- అట్టహాసంగా నియోజకవర్గ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): 'మా ప్రాణం మీరే.. మీరే మమ్మల్ని ముందుండి నడిపించారు. ఊపిరి ఉన్నంతవరకు మీ కోసమే పనిచేస్తామ'ని టీడీపీ కార్యకర్తలను ఉద్దేశించి ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. మండలంలోని కక్కలపల్లి క్రాస్‌లో గల ఆర్ కన్వెన్షన్ హాల్‌లో గురువారం టీడీపీ నియోజకవర్గ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం అట్టహాసంగా సాగింది. కార్యక్రమానికి ఎమ్మెల్యే పరిటాల సునీత, టీడీపీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు అంజినప్ప హాజరయ్యారు. ముందుగా పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్, మాజీ మంత్రి పరిటాల రవీంద్ర చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఎంపికైన 1350మంది బూత్, గ్రామ, యూనిట్, క్లస్టర్, మండల కమిటీల సభ్యులతో ఉమ్మడిగా ప్రమాణ స్వీకారం చేయించారు. శాలువాలు, పూలతో సన్మానం చేశారు. ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ.. పార్టీ కోసం కష్టపడిన నాయకులకు తగిన గుర్తింపు నిచ్చే బాధ్యత తమదన్నారు. ఇప్పటికే చాలామందికి పదవులు దక్కాయన్నారు. వారంతా బాధ్యతగా పని చేయాలన్నారు. ఇంకా కొన్ని పెండింగ్‌లో ఉన్నాయనీ, వాటిని త్వరలోనే ఎంపిక చేస్తామన్నారు. గత ఐదేళ్లలో నియోజవకర్గంలో ఎలాంటి అభివృద్ధి చేయని ప్రకాష్‌రెడ్డి ఇష్టం వచ్చినట్లు.. తమపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. దీనిని తిప్పి కొట్టాల్సిన బాధ్యత నాయకుడిపై ఉందన్నారు. ఒక మహిళ చేతిలో మూడుసార్లు ఓడిపోయిన అసమర్థుడు ప్రకాష్ రెడ్డి అన్నారు. ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చి.. అభివృద్ధి గురించే పట్టించుకోకపోవడంతే ప్రజలు దారుణంగా ఓడించారన్నారు. కూటమి చేస్తున్న అభివృద్ధిని చూసి నియోజకవర్గంలో తనకు మనుగడ ఉండదన్న ఉద్దేశంతోనే ప్రకాష్‌రెడ్డి.. పరిటాల కుటుంబం గురించి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. పరిటాల రవీంద్ర పేరును తగ్గించే పనులు తమ కుటుంబం ఎప్పుడూ చేయదన్నారు. అలా చేస్తే.. కాలర్ పట్టుకుని నిలదీయాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు.



మండల క్లస్టర్, యూనిట్, గ్రామ బూత్ కమిటీ సభ్యులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

చిన్న సారు పెత్తనం..!

పన్నుల శాఖలో చోద్యం

- అసోసియేషన్ ముసుగులో చిరుద్యోగి హవా
- తాడిపత్రి సర్కిల్‌లో స్ర్కాప్, గ్రానైట్, లారీ తనిఖీలతో మామూళ్లు
- ఉన్నతాధికారికీ ముడుపులు?
- జూనియర్ అసిస్టెంట్, అటెండర్‌లే వసూల్ రాజాలు



అనంతపురం కలెక్టరేట్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అక్కడ ఓ చిన్న సారుదే పెత్తనం. పన్నుల శాఖలోని అసోసియేషన్‌లో కీలకపాత్ర పోషిస్తున్న ఆయన అన్నీ తానై వ్యవహరిస్తుంటారు. ఏ సర్కిల్‌లో పనిచేస్తే అక్కడ ఉన్నతాధికారిని డమ్మీ చేసేస్తారన్న చర్చలు వినిపిస్తున్నాయి. జిల్లాలో కీలక స్థానాల్లో ఉన్న అధికారులకు సైతం ఈయనంటే హడల్. ప్రస్తుతం తాడిపత్రి సర్కిల్‌లో పనిచేస్తున్న ఈయన అక్కడా తనదైన శైలిలో చక్రం తిప్పుతున్నారు. ఉన్నతాధికారికి ముడుపులు సైతం ఈయన నుంచే వెళ్లాల్సిందేనంటే పరిస్థితి ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ సర్కిల్‌లో ఎక్కువగా జీరో బిజినెస్ జరుగుతోంది. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ జేబులు నింపుకుంటున్నారు. అక్కడ జరిగే వ్యవహారం ఉన్నతాధికారులకు తెలిసినా అసోసియేషన్‌లో ఆయనకున్న పవర్‌ను చూసి మిన్నకుండిపోతున్నారు.

స్ర్కాప్, గ్రానైట్ గుండ్లతో...

తాడిపత్రి సర్కిల్‌లో స్ర్కాప్ బిజినెస్ పెద్ద మొత్తంలో జరుగుతోంది. ఐరన్ ఫ్యాక్టరీలు ఉండటంతో ఇనుప తుక్కు భారీగానే ఇతర ప్రాంతాలకు తరలిస్తుంటారు. టన్నుల కొద్దీ పెద్ద వాహనాల్లో రవాణా చేస్తారు. వాస్తవానికి ఈ స్ర్కాప్ నుంచి పన్నుల శాఖకు 18 శాతం జీఎస్టీ చెల్లించాలి. దానిని ఎగ్గొట్టి.. అంతా జీరో బిజినెస్ జరుగుతుంటుంది. ఒక వే బిల్లుపై నాలుగైదు వాహనాలు తరలించడం లాంటివి చేస్తున్నారు. ఈ విషయంలో ఆ చిన్న సారుకు ముడుపులు వెళ్తుంటాయనే ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో ప్రతినెలా రూ.10 లక్షలకుపైగా జీఎస్టీ ఎగవేస్తున్నట్లు సమాచారం. ఇక తాడిపత్రిలో 60 వరకు గ్రానైట్ గుండ్ల క్రషింగ్ (పాలిష్) ఫ్యాక్టరీలున్నాయి. ప్రకాశం జిల్లా కనిగిరితోపాటు కర్ణాటక, ఉమ్మడి జిల్లాలోని కొన్ని ప్రాంతాల నుంచి గ్రానైట్ గుండ్లను తరలిస్తుంటారు. వీటిలో భారీగా జీరో బిజినెస్ జరుగుతోంది. ఒక్కో గ్రానైట్ గుండుపై రూ.30వేలు జీఎస్టీ చెల్లించాలి. ఆ పన్ను ఎగ్గొడుతున్నారు. ఇక్కడ కూడా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ అధికారులు ముడుపులు పుచ్చుకుంటున్నారు.

లారీ చెకింగ్‌లతో...

తాడిపత్రి సర్కిల్ పరిధిలో భారీ వాహనాల్లో వివిధ ప్రాంతాలకు అనేక వస్తువులు రవాణా అవుతుంటాయి. పన్నుల శాఖలో లారీ చెక్ పేరుతో అధికారులు, సిబ్బంది తనిఖీలు చేస్తుంటారు. ఇక్కడ లారీ చెక్‌లతో అధికారులు ఆమ్యామ్యాలు పుచ్చుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఇదివరకు అక్కడ పనిచేస్తున్న అధికారులు లారీ చెక్‌లలో జరిమానాలు వేసి ఆ శాఖకు ఆదాయం చూపారు. ఒకరిద్దరు డీసీటీఓలు ఒక్కో వాహనానికి రూ.5 లక్షల నుంచి అత్యధికంగా రూ.14 లక్షల వరకు జీఎస్టీ, జరిమానా విధించిన దాఖలాలున్నాయి. కొంతకాలంగా ఆ స్థాయిలో తనిఖీలు చేయడం లేదనీ, చేసినా ఆదాయం చూపడం లేదని ఆ శాఖ వర్గాలే పేర్కొంటున్నాయి.

వారే.. వసూల్ రాజాలు

తాడిపత్రి సర్కిల్‌లో ఏం జరిగినా ఆ చిన్న సారుకు తెలియాల్సిందే. అటెండర్‌కు సీనియర్ అసిస్టెంట్‌కు మధ్య కేడర్‌లో ఉండే ఆ చిరుద్యోగి అసోసియేషన్ ముసుగులో వ్యవహారాలు వెలగబెడుతున్నారు. తనుకు అనుకూలంగా ఉన్న జూనియర్ అసిస్టెంట్, ఓ అటెండర్ సాయంతో వసూళ్లకు తెరలేపుతుంటారు. వాహనాలు తనిఖీ చేయాలంటే కనీసం డీసీటీఓ స్థాయి అధికారి ఉండాలి. ఇక్కడ ఆ నిబంధనలేమీ పనిచేయవు. జూనియర్ అసిస్టెంట్, అటెండర్‌లే దర్జాగా లారీ చెక్‌లలో పాల్గొంటారు. మరోలా చెప్పాలంటే వీరు ఇక్కడ వసూల్ రాజాల అవతారం ఎత్తారు. ప్రతినెలా వచ్చే ఆమ్యామ్యాలు, డీలర్ల నుంచి పుచ్చుకునే ముడుపులు, వాహన తనిఖీల్లో అందే సొమ్ము ఇలా అంతా ఆ చిన్న సారుకు వెళ్తాయి. ఏమీ మాట్లాడకుండా ఉండటానికి ఉన్నతాధికారికి కూడా ఈ సారు నుంచే కొంత భాగం వెళ్తుందని తెలుస్తోంది. దీంతో ఆ ఉన్నతాధికారి కిమ్మనకుండా ఉంటున్నారనే విమర్శలున్నాయి. ఇలా.. నెలనెలా పన్నుల శాఖ ఆదాయానికి భారీగానే గండి కొడుతున్నారు.

ఆదరణ 3.0 లోడింగ్..!

బడుగులకు తీపికబురు

- కులవృత్తుల వారి సంక్షేమానికి సీఎం నిర్ణయం
- లబ్ధిదారులకే పనిముట్లను ఎంచుకునే స్వేచ్ఛ
- 10శాతం చెల్లిస్తే చాలు మిగిలిన భారం ప్రభుత్వానిదే..
- డిసెంబరు నుంచే ప్రక్రియ?



బీసీ కార్పొరేషన్ కార్యాలయం

అనంతపురం విద్య, నవంబరు13(ఆంధ్రజ్యోతి): బడుగులకు తీపికబురు. టీడీపీ హయాంలో అమలు చేసిన ఆదరణ పథకం మళ్లీ పట్టాలెక్కనుంది. కులవృత్తిదారులకు పనిముట్లను ప్రభుత్వం పంపిణీ చేయనుంది. ఆ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. టీడీపీ హయాంలో ఆదరణ పథకం కింద గొర్రెల కాపర్లు, కల్లుగీత కార్మికులు, కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, భవన నిర్మాణ కార్మికులు, వడ్డెర, నాయీబ్రాహ్మణులు, రజకులు, చేనేత కార్మికులు, టైలరింగ్, పాలవ్యాపారం, ఎలక్ట్రీషియన్ ఇలా కులవృత్తిదారులకు పనిముట్లను ప్రభుత్వమే అందించింది. వైసీపీ అధికారం చేపట్టాక ఆదరణ పథకాన్ని అటకెక్కించింది. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి మళ్లీ బీసీ కులవృత్తిదారులను ఆదుకోవడానికి ఆదరణ 3.0 అమలు చేయనుంది. ఇందుకు సీఎం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతోపాటు ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించారు. దీంతో ఆదరణ 3.0 పథకం అమలుకు యంత్రాంగం అడుగులు వేస్తోంది. వచ్చే ఏడాది ప్రారంభం నుంచే లబ్ధిదారులకు పనిముట్లు అందజేయనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

లబ్ధిదారులే ఎంపిక చేసుకోవచ్చు..

ఆదరణ 3.0 పథకాన్ని ఈసారి పక్కాగా అమలు చేసేందుకు సీఎం చంద్రబాబు ప్రణాళికలు రూపొందించినట్లు చెబుతున్నారు. గతంలో ఈ పథకం ద్వారా ప్రభుత్వమే వృత్తిదారులకు ఏది కావాలో నిర్ణయించి పనిముట్లు సరపరా చేసింది. పరికరాల విలువలో 10 శాతం లబ్ధిదారుడు చెల్లిస్తే మిగిలిన 90శాతం ప్రభుత్వమే భరించింది. అపుడు ఒకేసారి మాత్రమే లబ్ధిదారులకు అవకాశం కల్పించింది. ఈసారి అలా కాకుండా లబ్ధిదారుడికే పరికరాలను ఎంపిక చేసుకునే అవకాశం కల్పించనున్నట్లు యంత్రాంగం చెబుతోంది. తర్వాత వాటిని ప్రభుత్వం కొనుగోలు చేసి లబ్ధిదారులకు పంపిణీ చేయనుంది. ఏటా దరఖాస్తులు స్వీకరించి, అర్హులకు పనిముట్లు అందించనున్నారు. ఆదరణ 3.0 పథకంలో కూడా 10 శాతం లబ్ధిదారులు చెల్లిస్తే.. 90శాతం ప్రభుత్వమే సబ్సిడీ కింద భరించనుంది.

మార్గదర్శకాలు రావాల్సి ఉంది..



బీసీ(కులవృత్తదారు)లకు ఆదరణ 3.0 కింద పనిముట్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే సీఎం.. రాష్ట్రస్థాయి అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. జిల్లాకు ఆ మేరకు సంకేతాలు వచ్చాయి. మార్గదర్శకాలు రావాల్సి ఉంది.

● రామసుబ్బారెడ్డి, బీసీ కార్పొరేషన్ ఈడీ



నిరసన తెలుపుతున్న చేతివృత్తికార్మికులు

ఆదరణ వెంటనే అమలు చేయాలి

ఆదరణ పథకాన్ని వెంటనే అమలు చేయాలని చేతివృత్తిదారులు నిరసన చేపట్టారు. గురువారం చేతివృత్తిదారుల సమాఖ్య ఆధ్వర్యంలో అనంతపురంలోని బీసీ కార్పొరేషన్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఆ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు లింగమయ్య మాట్లాడుతూ.. చేతివృత్తిదారులకు రుణాలు అందించి ఆదుకుంటామని కూటమి సర్కారు హామీ ఇచ్చినా.. ఇంతవరకు అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. జిల్లాలో 30 రకాల కులవృత్తిదారులు ఉన్నారనీ, వీరందరూ ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ రుణాలకోసం ఎదురు చూస్తున్నారన్నారు. వెంటనే సీఎం స్పందించి రుణాలు మంజూరుచేసి పరికరాలు అందించి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం బీసీ కార్పొరేషన్ ఈడీ రామసుబ్బారెడ్డికి వినతిపత్రం అందజేశారు. నిరసనలో చేతివృత్తిదారుల సమాఖ్య నాయకులు నాగప్ప, టీసీ భూషణ, రాజు, రాము, గోవిందరాజులు, రఘు,సుంకన్న, పాపన్న, ఈశ్వరమ్మ, వీరాంజి, చిన్న నారాయణస్వామి, ఆదినారాయణ, మారుతి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఘరానా దొంగ అరెస్ట్?

- కళ్యాణదుర్గంలో అదుపులోకి తీసుకున్న కర్ణాటక పోలీసులు
- నిందితుడిపై వందకుపైగా చోరీ కేసులు

కళ్యాణదుర్గం రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): వివిధ రాష్ట్రాల్లో చోరీలకు పాల్పడుతున్న కళ్యాణదుర్గానికి చెందిన ఓ వ్యక్తిని కర్ణాటక పోలీసులు బుధవారం అరెస్టు రాత్రి అరెస్టు చేశారు. ఇతడిపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో వందకుపైగా చోరీ కేసులు ఉన్నట్లు సమాచారం. ఇతను వివిధ చోరీ కేసుల్లో అరెస్టు అయ్యి ఈ ఏడాది సెప్టెంబరు 13న విడుదలయ్యాడు. రెండు రోజులు కూడా గడవక ముందే సెప్టెంబరు 17న కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లా మొలకాల్మూరు తాలుకా రాంపురం పట్టణంలో 16 తులాల బంగారం చోరీ చేశాడు. పరారీలో ఉన్న అతడిపై కర్ణాటకలో కేసు నమోదైంది. ఘటనాస్థలంలో దొరికిన సీసీ ఫుటేజీ ఆధారంగా కర్ణాటక పోలీసులు నిందితుడు కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఈ నేపథ్యంలోనే కర్ణాటక పోలీసులు సీఐ మంజునాథ్, ఎస్ఐ బాహుబలి ఆధ్వర్యంలో మూడు వాహనాల్లో పట్టణానికి వచ్చారు. పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చి నిందితుడిని అరెస్టు చేసినట్లు సమాచారం. దొంగతనాలకు పాల్పడిన వ్యక్తి చోరీ సొత్తును పట్టణంలోని ముగ్గురు మహిళలకు ఇచ్చినట్లు పోలీసులు గుర్తించారు ఆ మహిళల నుంచి పది తులాల బంగారం రికవరీ చేసినట్లు సమాచారం. ఈ ముగ్గురు మహిళల్లో ఒకరిపై రౌడీషీట్ కూడా ఉన్నట్లు తెలిసింది. ఈ ముగ్గురు మహిళలపై కళ్యాణదుర్గం, కర్ణాటక పోలీస్‌స్టేషన్‌లో అక్రమ మద్యం, మట్కా, తదితర అనేక కేసులు ఉన్నట్లు సమాచారం. వీరి వెనుక మరికొంతమంది హస్తం ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


ప్రమాదంలో దెబ్బతిన్న ద్విచక్రవాహనం

కూడేరు, నవంబరు13(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామచంద్రాపురం గ్రామ సమీపాన గురువారం రోడ్డు ప్రమాదంలో కృష్ణానాయక్ (32) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనంతపురం రూరల్ మండలం కురుగుంట వైఎస్ఆర్ కాలనీకి చెందిన కృష్ణానాయక్ రెస్టారెంట్‌లో పనిచేస్తుండేవాడు. అనంతపురం నుంచి కూడేరు వైపు ద్విచక్రవాహనంలో వస్తుండగా.. రామచంద్రాపురం వద్ద ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కృష్ణానాయక్‌ను అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. ఇతడికి భార్య రుక్మిణీబాయి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రుక్మిణీబాయి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కళ్లలో కారం కొట్టి దోపిడీ యత్నం

- కాపాడిన కళ్లద్దాలు


వివరాలు వెల్లడిస్తున్న సెల్‌ఫోన్ షాపు యజమాని సురేష్

సోమందేపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ షాపు యజమాని కళ్లలో కారం కొట్టి దారి దోపిడీ చేసేందుకు యత్నించారు. కళ్లద్దాల కారణంగా అతడు తప్పించుకున్నాడు. హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని గుడిపల్లికి చెందిన సురేష్ సోమందేపల్లిలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో మొబైల్ షాపు నిర్వహిస్తున్నారు. బుధవారం రాత్రి షాపును బంద్ చేసి స్వగ్రామానికి ద్విచక్రవాహనంలో బయల్దేరాడు. రూ.1.50లక్షలు నగదు, రూ.లక్ష విలువచేసే సెల్‌ఫోన్ల బ్యాగుతో బయల్దేరాడు. జాతీయ రహదారిపై పాపిరెడ్డిపల్లి సమీపాన యూటర్న్ వద్ద వాహనాలు వస్తుండటంతో ఆగాడు. ఇంతలో ఎదురుగా బైక్‌లో వచ్చిన ముగ్గురు దుండగులు అడ్డుగా నిలిపారు. కళ్లలో కారం కొట్టారు. కళ్లద్దాల కారణంగా అతడి కళ్లలోకి కారం పడలేదు. కిందపడిన సురేష్‌పై దుండగులు దాడికి యత్నించారు. వారి బారి నుంచి తప్పించుకుని పాపిరెడ్డిపల్లి వైపు పొలాల్లోకి పరుగులు తీశాడు. అదే సమయంలో పాలవ్యాన్ అటుగా రావడంతో దుండగులు తుంగోడు వైపు పరారయ్యారు. వెంటనే సురేష్.. గ్రామస్థులకు సమాచారం అందించాడు. అనంతరం సోమందేపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై విచారిస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డిపై కేసు

తాడిపత్రి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిపై గురువారం కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ ఆరోహణ రావు తెలిపారు. రెండురోజుల క్రితం పోలీసుల సమక్షంలోనే పెద్దారెడ్డి ఫ్యాక్షన్ చేస్తానంటూ ప్రజలను భయభ్రాంతులు చేసేలా మాట్లాడారని, దీనిపై 30వ వార్డు కౌన్సిలర్ మల్లికార్జున ఫిర్యాదు చేశారని, దీంతో పెద్దారెడ్డిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

టమోటా కిలో రూ.40

అనంతపురం రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్లో గురువారం టమోటాలు కిలో గరిష్ఠంగా రూ.40తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.20తో, సరసరిగా రూ.30తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 2025 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

చీనీ టన్ను రూ.18 వేలు

అనంతపురం రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి):అనంత వ్యవసాయ మార్కెట్లో గురువారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.18 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరి ధర రూ.15వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 26టన్నుల చీనీకాయలు వచ్చినట్లు చెప్పారు.

సివిల్స్‌కు ఉచిత శిక్షణ

అనంతపురం విద్య, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ కులాల నిరుద్యోగ అభ్యర్థులకు సివిల్ సర్వీసెస్(ప్రిలిమ్స్)కు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్సీ సంక్షేమ శాఖ ఇన్‌చార్జి డీడీ కుష్బూకొఠారి గురువారం ప్రకటనలో తెలిపారు. విజయవాడ, విశాఖపట్నం తిరుపతిలో శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. డిసెంబరు 10నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ 10వ తేదీ వరకు ఈశిక్షణ కొనసాగుతుందన్నారు. ఉచిత భోజనం, వసతి, కల్పిస్తారన్నారు. మొత్తం 340మంది అభ్యర్థులకు అవకాశం ఉంటుందనీ, ఇందులో మహిళలకు 33శాతం ఉంటుందన్నారు. ఆసక్తిగలవారు ఈనెల 20వతేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీడీ సూచించారు.

మహిళలకు..

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రూడ్‌సెట్‌లో ఈనెల 22 నుంచి మహిళలకు కుట్టు మిషన్, టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ విజయలక్ష్మి తెలిపారు. 18-45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి రేషన్, ఆధార్‌కార్డు కలిగిన ఉమ్మడి జిల్లా నిరుద్యోగ మహిళలు అర్హులన్నారు. 30రోజుల పాటు సాగే శిక్షణా కాలంలో భోజనం, వసతి సదుపాయం కల్పిస్తామన్నారు. వివరాలకు ఎస్కేయూ సమీపంలోని రూడ్‌సెట్ కార్యాలయంలో నేరుగా లేదా సెల్ నంబరు 9492583434ను సంప్రదించాలని కోరారు.

లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించండి

- ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ప్రచార కార్యదర్శి రామిరెడ్డి

అనంతపురం టౌన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు పీఎఫ్, ఎస్ఆర్‌బీఎస్ పింఛన్లు పొందేందుకు లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలని ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి రామిరెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. పీఎఫ్ కోసం డిజిటల్, ఎస్ఆర్‌బీఎస్ పింఛన్ కోసం మాన్యువల్ లైఫ్ సర్టిఫికెట్లను నెలాఖరులోపు సంబంధిత కార్యాలయాలకు చేర్చాలన్నారు. విశ్రాంత ఉద్యోగులు అనంతపురం డిపో వద్ద దరఖాస్తు ఫాంలను ఉచితంగా పొందవచ్చన్నారు. దరఖాస్తుకు ఆధార్ నకలు జతచేసి, పంపాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 9985431084 నంబరులో సంప్రదించాలన్నారు.

బడి పిల్లలకే.. ఉపకార వేతనం..!

- చక్కటి అవకాశం.. ఎన్ఎంఎంఎస్
- ఎనిమిదో తరగతి వారికి 7న పరీక్ష
- ఎంపికైన వారికి నాలుగేళ్లపాటు ప్రయోజనం


ఎన్ఎంఎంఎస్‌పై అవగాహన కల్పిస్తున్న టీచర్

ధర్మవరం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): చదువులో ప్రతిభ ఉన్నా ఆర్థిక పరిస్థితులు బాగోలేక కొందరు ఉన్నత చదువులకు దూరమవుతున్నారు. ఇలాంటి వారికి కేంద్ర ప్రభుత్వం ఆర్థిక చేయూతనందిస్తోంది. ప్రభుత్వం నిర్వహించే పరీక్షల్లో అర్హత సాధిస్తే నాలుగేళ్లపాటు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) బ్యాంకు ఖాతాలో జమ చేస్తుంది. ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులకు ఈ ఆర్థిక ప్రయోజనం ఎంతగానో ఉపయోగపడుతోంది. నెలరోజులు కష్టపడితే నాలుగేళ్లపాటు స్కాలర్‌షిప్ అందుతుంది. ఆయా పాఠశాలల్లో 8వ తరగతి చదివే విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించి ఎన్ఎంఎంఎస్ సాధించేలా తీర్చిదిద్దుతున్నారు. 2025-26 విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదివే వారికి ఉపకార వేతనం అందించేందుకు ఏటా పరీక్ష నిర్వహిస్తోంది. జిల్లాలో ప్రభుత్వ, ఎయిడెడ్, ఆదర్శ పాఠశాలల్లో చదువుతూ కుటుంబ ఆదాయం రూ.3.5 లక్షలలోపు ఉన్న విద్యార్థులు అర్హులని విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

జిల్లాలో 8వ తరగతి విద్యార్థుల వివరాలు ఇలా..

జిల్లావ్యాప్తంగా 8వ తరగతి చదివే విద్యార్థులు 24,184 మంది ఉన్నట్లు విద్యాశాఖ గణాంకాల ద్వారా తెలుస్తోంది. గతేడాది జిల్లా వ్యాప్తంగా ఈ పరీక్షలను 2,010 మంది విద్యార్థులు రాయగా.. 155 మంది ఎంపికయ్యారు. ఈ ఏడాది ఎన్ఎంఎంఎస్‌కు 2,697 దరఖాస్తులు రాగా.. 6 తిరస్కరించారు. మిగిలిన 2,661 మంది విద్యార్థులకు డిసెంబరు 7వ తేదీన పరీక్ష ఉంటుందని విద్యాశాఖ అధికారులు తెలిపారు. మెరిట్ ఆధారంగా ఎంపిక ఉంటుంది. 24రోజుల సమయం ఉంది. గత పరీక్షల్లో విజయం సాధించిన వారి అనుభవాలను పరిగణనలోకి తీసుకుని కష్టపడి చదివితే నాలుగేళ్లపాటు ఉపకార వేతనం అందుతుంది.

పేద విద్యార్థులకు చేయూత

- లాజర్, విద్యాశాఖ ఏడీ, శ్రీసత్యసాయి జిల్లా

చిన్నపాటి శిక్షణతో ఉపకార వేతనాలకు ఎంపిక కావచ్చు. విద్యార్థులను సన్నద్ధం చేయడంపై ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలి. పరీక్షల్లో ప్రతిభ చూపితే నాలుగేళ్లపాటు ఆర్థిక చేయూత లభిస్తుంది. ఎన్ఎంఎంఎస్‌కు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు పరీక్ష బాగారాసి ప్రతిభ కనబరచాలి.

ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికయ్యా



ధర్మవరం శాంతినగర్‌లోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో చదువుతున్నా. 8వ తరగతి చదువుతున్న సమయంలో పాఠశాలలో ఎన్ఎంఎంఎస్ శిక్షణ పొందడంతోపాటు ఉదయం, సాయంత్రం గణితంపై సాధన చేశా. సందేహాలను ఉపాధ్యాయులతో నివృత్తి చేసుకున్నా. ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికయ్యా. ప్రతినెలా రూ.1000 స్కాలర్‌షిప్ అందుతోంది.

-చైతన్య, పదో తరగతి విద్యార్థి

ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం



మా పాఠశాల నుంచి ఎన్ఎంఎంఎస్‌కు 20 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరికి రోజూ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. నమూనా ప్రశ్నపత్రాలతో పరీక్షకు సిద్ధం చేస్తున్నాం. మంచి ఫలితాలే లక్ష్యంగా కృషి చేస్తున్నాం.

-ఉమాపతి, హెచ్ఎం, శాంతినగర్ మున్సిపల్ పాఠశాల

ఎస్కేయూ రిటైర్డ్ వీసీ ప్రొఫెసర్ శుభ మృతి


ప్రొఫెసర్ శుభ (ఫైల్)

అనంతపురం రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం మాజీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ శుభ అనారోగ్యంతో గురువారం హైదరాబాదులో మృతి చెందారు. ఆమె వర్సిటీలో రసాయన శాస్త్ర ప్రొఫెసర్‌గా, సీడీసీ డీన్‌గా, రెక్టార్‌గా, ఇన్‌చార్జి ఉపకులపతిగా సేవలు అందించారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు సహా అనేక పురస్కారాలను అందుకున్నారు. ఇటీవల 'షీ ఈజ్ ఉమన్ ఇన్ కెమిస్ట్రీ' అనే లండన్‌కు చెందిన పుస్తకంలో ఆమె ఫొటో ప్రచురితమైంది. ప్రపంచ వ్యాప్తంగా 30 మంది అత్యున్నత మహిళా కెమిస్ట్రీ ప్రొఫెసర్లలో ఆమెకు చోటు దక్కింది. ప్రొఫెసర్ శుభ భర్త చౌడోజీ రావు ఎస్కేయూ పాలిమర్ సైన్స్ విభాగంలో ప్రొఫెసర్‌గా సేవలందించి, పదవీ విమరణ చేశారు. శుభ మృతికి జేఎన్‌టీయూఏ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య, ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ అనిత, రెక్టార్ వెంకటనాయుడు, రిజిస్ట్రార్ రమేష్‌బాబు తదితరులు సంతాపం ప్రకటించారు. ఆమె మృతదేహాన్ని అనంతపురం శారదనగర్‌లోని స్వగృహానికి గురువారం రాత్రికి తీసుకువచ్చారు. ఆమె పార్థివదేహానికి పలువురు నివాళులు అర్పించారు.

రేపు జాబ్‌మేళా

పెనుకొండ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శనివారం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జయప్ప, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరిక్రిష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటలకు కళాశాలలో నిర్వహించే జాబ్‌మేళాకు పది కంపెనీల ప్రతినిధులు హాజరవుతారన్నారు. ఇంటర్వ్యూకు హాజర య్యే విద్యార్థులు తాము చదివిన విద్యకు సంబంధించిన సర్టిఫికెట్లు వెంట తీసుకురావాలన్నారు. 18-35 సంవత్సరాలు కలిగినవారు అర్హులన్నారు.

రాష్ట్ర జట్టుకు ఇద్దరు ఎంపిక


వీరారెడ్డి, జయంత్ కృష్ణ

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా అండర్-19 మల్టీ డే క్రికెట్ జట్టులో జిల్లాకు చెందిన వీరారెడ్డి, జయంత్‌కృష్ణ చోటు దక్కించుకున్నారు. ఈ నెల 16వతేదీ నుంచి దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో నిర్వహించే కూచ్ బెహార్ ట్రోఫీలో ఆంధ్రా జట్టు తరపున వీరు ప్రాతినిధ్యం వహించనున్నారు. జాతీయ పోటీలకు ఎంపికైన వీరిని పలువురు అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు నార్పల విద్యార్థులు


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

నార్పల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ జిల్లా ఎంపికలో నార్పల ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు హాకీ, నెట్‌బాల్‌లో మంచి ప్రదర్శన కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపకయ్యారు. అండర్-17 హాకీలో వీ మనోజ్, అండర్-19 నెట్‌బాల్‌లో ఈ చేతన్, అండర్-14 నెట్‌బాల్‌లో మనోజ్‌కుమార్ రెడ్డి పోటీలలో పాల్గొంటారని హెచ్ఎం రవికుమార్ తెలిపారు. విద్యార్థులను పీడీ ఆంజనేయులు, పీఈటీ సనీమాబేగం, ఉపాధ్యాయులు అభినందించారు.

క్రీడలతో మానసిక ఆహ్లాదం

- ఎస్కేయూ రిజిస్ట్రార్ రమేష్‌బాబు



మాట్లాడుతున్న ఎస్కేయూ రిజిస్ట్రార్ రమేష్ బాబు

కళ్యాణదుర్గంరూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఆహ్లాదాన్ని కలిగిస్తాయని ఎస్కేయూ రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్ బాబు అన్నారు. స్థానిక కరణం చిక్కప్ప ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో గురువారం ఎస్కేయూ ఇంటర్ కాలేజియెట్ గ్రూప్ బి పోటీలు ప్రారంభమయ్యాయి. రిజిస్ట్రార్ రమేష్ బాబు జ్యోతిని వెలిగించి, పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో చురుగ్గా ఉన్న పిల్లల్లో నాయకత్వ లక్షణాలతో పాటు ఇతర నైపుణ్యాలు దాగి ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఎస్కేయూ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి డాక్టర్ జెస్సీ, కళాశాల ప్రిన్సిపాల్ హర్షలత, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ అర్థశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ కోనంకి శ్రీధర్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు వందమంది ఉద్యోగులు


ప్రభుత్వ ఉద్యోగుల క్రికెట్ పోటీల్లో డీఎస్‌డీఓ, శాప్ కోచ్‌లు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ప్రభుత్వ ఉద్యోగుల క్రీడాపోటీలకు జిల్లా నుంచి వంద మంది ఎంపికయ్యారు. ప్రభుత్వ ఉద్యోగుల జిల్లా స్థాయి క్రీడా పోటీలు గురువారం నగర పరిధిలోని వేర్వేరు మైదానాల్లో నిర్వహించారు. 150మందికిపైగా పోటీల్లో పాల్గొనగా.. రాష్ట్రస్థాయి పోటీలకు వందమంది ఎంపికయ్యారని డీఎస్‌డీఓ మంజుల తెలిపారు. వారు ఈనెల 19వ తేదీ నుంచి ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. వివరాలకు 08554-315632 నంబరులో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో డీఎస్‌ఏ సూపరింటెండెంట్ దేవమణి, శాప్ కోచ్‌లు జెబీవుల్లా, సంధ్య, లక్ష్మి పాల్గొన్నారు.

ఆంధ్రా అండర్-13 జట్టులో దీపక్



అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అండర్-23 క్రికెట్ జట్టులో జిల్లాకు చెందిన దీపక్‌కు చోటు దక్కింది. శుక్రవారం నుంచి బరోడాలో నిర్వహించే బీసీసీఐ అండర్-13 జాతీయ వన్డే టోర్నీలో ఆంధ్రా జట్టు తరపున దీపక్ ప్రాతినిధ్యం వహించనున్నాడు. దీపక్‌ను పలువురు అభినందించారు.

ఆర్చరీ జిల్లా జట్ల ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆర్చరీ జిల్లా క్రీడాకారులను ఎంపిక చేశారు. ఆర్డీటీ స్టేడియంలో గురువారం ఉమ్మడి జిల్లాస్థాయి ఆర్చరీ జూనియర్స్, సీనియర్స్ బాల, బాలికల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారుల వివరాలను జిల్లా ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి శివకుమార్ వెల్లడించారు.

జూనియర్ బాలుర కేటగిరిలో అల్లీషర్ మహ్మద్, అభినవ్, సలేహా, దాదాసల్మాన్, యోగేశ్వర్‌రెడ్డి, సాయి ఈశ్వర్, ఎస్‌జే బాషా, ప్రజ్వల్ ఎంపికయ్యారు.

బాలికల విభాగంలో శ్రీలేఖ, గుణశ్రీ, అనీమా ప్రియదర్శిని, వందన, జాహ్నవి, మాన్వితలు ఎంపికయ్యారు.

సీనియర్ బాలుర విభాగంలో మహమూద్, పవన్, అనీల్, ప్రకాష్, హరీష్‌రెడ్డి, సలేహా, దాదా సల్మాన్, భోగేశ్వర్‌రెడ్డి, ప్రజ్వల్, ఎస్‌జే బాషా, రాఘవేంద్ర, ఇసాక వుల్లా, వెంకటరమణ ఎంపికయ్యారు.

బాలికల్లో శ్రీరమ్య, శ్రీలేఖ, గుణశ్రీ, ప్రియదర్శిని అర్హత సాధించారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 16 నుంచి నూజివీడులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీకృష్ణ, పీఈటీ హరీష్, కోచ్‌లు నళిని, లక్ష్మీదేవి, రాహుల్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


ఎంపికైన జిల్లా ఆర్చరీ జట్టు

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే

- వృద్ధ దంపతులను రోడ్డు దాటించిన ఎంఎస్ రాజు


వృద్ధులను రోడ్డు దాటిస్తున్న ఎమ్మెల్యే

మడకశిర టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నడవడానికి ఇబ్బంది పడుతున్న వృద్ధ దంపతులను రోడ్డు దాటించి ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మానవత్వం చాటుకున్నారు. మండలంలోని హరేసముద్రం గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు గురువారం బ్యాంకు పని నిమిత్తం పట్టణానికి వచ్చారు. స్టేట్ బ్యాంకు సమీపాన రోడ్డు దాటడానికి ఇబ్బంది పడుతుండేవారు. అదే సమయంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు.. గుడిబండ మండలానికి వెళ్తూ అటుగా వచ్చారు. వృద్ధ దంపతుల పరిస్థితిని చూసి.. వెంటనే వాహనాన్ని ఆపారు. ఆయన కిందికి దిగి వృద్ధ దంపతుల వద్దకెళ్లి వారి పరిస్థితిని అడిగి తెలుసుకొన్నారు. రోడ్డు దాటించి మానవత్వం చాటుకున్నారు. స్టేట్‌బ్యాంకు వద్దకు తోడుగా పంపించారు. వృద్ధుల పని పూర్తి చేయించి, ఆటోలో స్వగ్రామానికి పంపించాలని సిబ్బందికి సూచించారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి

- అహుడా చైర్మన్ టీసీ వరుణ్



అర్జీలు స్వీకరిస్తున్న అహుడా చైర్మన్, జేసీ

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): అనంతపురం-హిందూపురం పట్టణాభివృద్ధి సంస్థ (అహుడా) పరిధిలో ప్రజలు విన్నవించిన సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని చైర్మన్ టీసీ వరుణ్.. అధికారులను ఆదేశించారు. స్థానిక అహుడా కార్యాలయంలో గురువారం నిర్వహించిన స్పెషల్ గ్రీవెన్స్‌లో జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మతో కలిసి ఆయన అర్జీలను స్వీకరించారు. అర్జీదారులతో నేరుగా మాట్లాడిన చైర్మన్ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన సమీక్షలో పలు అంశాలపై చర్చించారు. ఎంఐజీ లేఅవుట్లలో మౌలిక వసతుల కల్పన పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతపురం నగరంలో పింక్ టాయిలెట్ల నిర్మాణం, స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు తదితర పనులను త్వరితగతిన ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో అహుడా కార్యదర్శి రామకృష్ణారెడ్డి, ప్లానింగ్ ఆఫీసర్ ఇషాక్, జేపీఓ హరీష్‌చౌదరి, ఈఈ దుష్యంత్, డీఈ రేవంత్, పబ్లిక్ హెల్త్ డీఈ జ్యోతి పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేయండి

- నూతన ఎంపీడీఓలకు జడ్పీ చైర్‌పర్సన్ సూచన


ఎంపీడీఓలుగా నియామక పత్రాలు అందజేస్తున్న గిరిజమ్మ

అనంతపురం న్యూటౌన్, నవంబరు13(ఆంధ్రజ్యోతి) బాధ్యతతో విధులు నిర్వర్తించి మంచి గుర్తింపును పొందాలని ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి పొందిన వారికి జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ సూచించారు. ఏఓల నుంచి ఐదుగురు, డిప్యూటీ ఎంపీడీఓల నుంచి మరో ఐదుగురు ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి పొందారు. దీంతో ఉమ్మడి జిల్లాలో ఖాళీగా ఉన్న ఎంపీడీఓ స్థానాల్లో వారికి గురువారం పోస్టింగ్స్ ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక జడ్పీ కార్యాలయంలో చైర్‌పర్సన్ గిరిజమ్మ చాంబర్‌లో చేపట్టారు. వెంకటాచలపతిని కనగానపల్లికి, గంగాధర్ అగళి, రత్నాబాయి పెద్దపప్పూరు, రామ్‌కుమార్ తనకల్లు, రామకృష్ణ గాండ్లపెంట, హరికృష్ణ బాలాజీ చిలమత్తూరు, దేవదాసు గుంతకల్లు, రాధాకృష్ణ విడపనకల్లు, దామోదరమ్మ హిందూపురం, అశోక్‌కుమార్‌రెడ్డిని నల్లచెరువు ఎంపీడీఓలుగా నియమిస్తూ చైర్‌పర్సన్ ప్రొసీడింగ్స్ అందజేశారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ శివశంకర్, జిల్లా పరిషత్ కార్యాలయంలోని సంబంధిత పరిపాలన విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రా అండర్-19 క్రికెట్ జట్టుకు మాన్విత



మాన్వితను అభినందిస్తున్న హెచ్ఎం సిస్టర్ అమలామేరీ

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్కూల్‌గేమ్స్ రాష్ట్ర అండర్-19 క్రికెట్ జట్టుకు అనంత అమ్మాయి మాన్విత ఎంపికైంది. ఇటీవల శ్రీకాకుళంలో నిర్వహించిన క్రికెట్ టోర్నీలో ప్రతిభ కనబరచిన మాన్విత జాతీయ పోటీలకు అర్హత సాధించింది. అనంతపురం స్పోర్ట్స్ అకాడమీలో మాన్విత సాధన చేస్తోంది. నెలాఖరులో జరిగే జాతీయ క్రికెట్ పోటీలకు ఆంధ్రా అండర్-19 జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనుంది. విన్సెంట్ డీపాల్ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ అమలామేరీ, పీడీలు నారాయణ రెడ్డి, సుధాకర్‌రెడ్డి.. మాన్వితను అభినందించారు.

అభివృద్ధిని జీర్ణించుకోలేకే విమర్శలు



మాట్లాడుతున్న టీసీ వరుణ్

అనంతపురం న్యూటౌన్, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని జీర్ణించుకోలేకనే వైసీపీ నాయకులు విమర్శలకు దిగుతున్నారని జనసేన జిల్లా అధ్యక్షుడు, అహుడా చైర్మన్ టీసీ వరుణ్ మండిపడ్డారు. నగరంలోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకుంటే మంచిదన్నారు. ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్‌కళ్యాన్ పరిపాలనా తీరును రాష్ట్రమంతా మెచ్చుకుంటున్నారన్నారు. అలాంటి వ్యక్తిని విమర్శించే స్థాయి శ్రీధర్‌రెడ్డికి లేదన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రతి హామీని అమలు చేస్తున్నట్లు చెప్పారు. దీన్ని జీర్ణించుకోలేకనే వైసీపీ వాళ్లు విమర్శలు చేస్తున్నారన్నారు. ఇకపై ఇలాగే ప్రవర్తిస్తే జనసైనికుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు.

శ్రీధర్‌రెడ్డీ.. నోరు అదుపులో పెట్టుకో..

వైసీపీ మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డికి తమ పార్టీ అధినేత పవన్‌కళ్యాన్‌ను విమర్శించే స్థాయి లేదని జనసేన పుట్టపర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి, ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పత్తి చంద్రశేఖర్ ప్రకటనలో అన్నారు. గత బుధవారం ఓ కార్యాక్రమంలో శ్రీధర్‌రెడ్డి డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ను విమర్శిస్తూ అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. బ్యాంకులను మోసం చేసిన శ్రీధర్‌రెడ్డికి తమ అధినేత గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. ఆయన ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు పుట్టపర్తి నియోజకవర్గంలో ఏమిఅభివృద్ధి చేశారో చెప్పాలని ప్రశ్నించారు. ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకోవాలన్నారు. లేకుంటే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

మహాసభలను విజయవంతం చేయండి



పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

అనంతపురం రూరల్, నవరంబ 13(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తరిమెల నాగరాజు, చంద్రశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆమేరకు గురువారం అనంతపురం వ్యవసాయ మార్కెట్ వద్ద పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. ఈనెల 27, 28వ తేదీల్లో గార్లదిన్నె మండల కేంద్రంలో సంఘం 13వ జిల్లా మహాసభలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు రామ్‌భూపాల్ హాజరవుతారన్నారు. జిల్లాలోని రైతాంగ సమస్యలపై తీర్మానాలు ఆమోదించడంతో పాటు నూతన కమిటీని ఎన్నిక చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు శివారెడ్డి, బీహెచ్‌రాయుడు, జిల్లా కమిటీ సభ్యులు చెన్నారెడ్డి, వలి, సంజీవరెడ్డి, సుబ్రమణ్యం, రవితేజరెడ్డి, బి.చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

అనంతపురంరూరల్, నవంబరు13(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును పునరుద్ధరణ చేసి సంక్షేమ పథకాలను అమలు చేయాలని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు ప్రసాద్, రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈనెల 20వ తేదీన జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ ధర్నాకు సంబంధించిన కరపత్రాలను అనంతపురం రూరల్ పంచాయతీలో గురువారం ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికులకు గత వైసీపీ ప్రభుత్వం సంక్షేమ వెల్ఫేర్ బోర్డును నిలుపుదల చేసి తీరని అన్యాయం చేసిందన్నారు. పస్తుత ప్రభుత్వమైనా స్పందించి బోర్డును పునరుద్ధరించి సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరారు. కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు వెంకటనారాయణ, సాయి, లక్ష్మీ, పక్కీరప్ప, వీరేష్, నరసింహులు, సురేంద్ర పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

గార్లదిన్నె, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం లాభదాయమని రిడ్స్ సంస్థ ప్రకృతి వ్యవసాయం కోఆర్డినేటర్ రామాంజనేయులు పేర్కొన్నారు. మండలంలోని కొప్పలకొండ, కేశవాపురం గ్రామాల్లో గురువారం ఆయన రైతు సేవాకేంద్రం సిబ్బందితో కలిసి రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వ్యవసాయంలో రసాయనిక ఎరువులు వాడడం ద్వారా భూమిలో మిత్రపురుగులు చనిపోయి పంటలు తెగుళ్ల బారిన పడతాయన్నారు. భూమి సారవంతం తగ్గిపోయి దిగుబడులు సరిగా రావన్నారు. సేంద్రియ ఎరువులు వాడితే భూమిలో సారవంతం పెరిగి ఆశించినంత దిగుబడి వస్తుందన్నారు. కనుక రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకంపై మొగ్గు చూపాలని సూచించారు. రబీలో సాగుచేసిన పంటలకు ఈ క్రాప్ బుకింగ్ చేసుకోవాలని రైతు సేవాకేంద్రం సిబ్బంది రైతులకు తెలిపారు. రైతుసేవా కేంద్రం వీహెచ్ఏ ఆమని, రిడ్స్ ప్రోగ్రామ్ మేనేజర్ సురేష్ నాయుడు, వాటర్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ రాముడు, కమ్యూనిటి రిసోర్స్ పర్సన్స్ మురళి, ఈశ్వరయ్య, రాము, శ్వేత, రైతులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రజాదర్బార్

నార్పల, నవంబరు13(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మమతాదేవి గురువారం ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 9గంటలకు జరిగే కార్యక్రమానికి మండల పరిధిలోని ప్రజలందరూ సమస్యలను అర్జీల రూపంలో అందజేయాలన్నారు. ఈ ప్రజాదర్బార్‌కు ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, సర్పంచులు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆమె సూచించారు.

రైతుల సమ్మేళనాన్ని విజయవంతం చేయండి

శింగనమల,నవంబరు13(ఆంధ్రజ్యోతి): ఆదోనిలో నిర్వహించే పత్తి రైతుల రాష్ట్ర స్థాయి సమ్మేళనాన్ని రైతులు విజయవంతం చేయాలని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు డి.చిన్నప్పయాద్ కోరారు. శింగనమల సీపీఐ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 18,19వ తేదీల్లో కర్నూలు జిల్లా ఆదోనిలో పత్తి రైతులు రాష్ట్ర స్థాయి సమ్మేళనం నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున రైతులు తరలిరావాలని కోరారు. నాయకులు మధుయాదవ్, నేసేమధు, నారప్ప, వెంకటరెడ్డి బాషా తదితరులు పాల్గొన్నారు..

అన్నప్రసాద వితరణకు నగదు అందజేత

అనంతపురంరూరల్,నవంబరు13(ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రంపేట పంచాయితీ వికలాంగుల కాలనీలో గల మరకత లింగశివాయంలో విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవంలో అన్నప్రసాద వితరణకు ఎంఎస్ఎస్ సేవా సంస్థ అధ్యక్షుడు సాదిక్ వలి రూ.15 వేలు అందజేశారు. ఎంపీటీసీ సభ్యురాలు మహబూబ్‌బీ చేతుల మీదుగా అందకు సంబంధించిన చెక్కును ఆలయం వద్ద కార్యక్రమ నిర్వాహకులకు గురువారం అందించారు. ఆలయ కమిటీ సభ్యులు రామ్మూర్తి, గవ్వల శ్రీనివాసులు, వరుణ్‌చౌదరి, పరంధామ, వెంకటేశులు, పెద్దన్న పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న ఎంపీటీసీ సభ్యురాలు మహబూబ్‌బీ



కాలువ నిండి సర్వీస్ రోడ్డుపైకి వచ్చిన మురుగునీరు



సర్వీసు రోడ్డు మోరీ కింద నిల్వ ఉన్న మురుగు నీరు

హైవేపై.. దుర్గంధం

- సర్వీస్‌రోడ్డుపై భారీగా మురుగునీటి నిల్వ
- కంపు కొడుతుండడంతో అసౌకర్యానికి గురవుతున్న వాహనదారులు, స్థానికులు

అనంతపురం రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రుద్రంపేట సమీపంలోని హైదరాబాద్-బెంగళూరు హైవేపై దుర్గంధం వెదజల్లుతోంది. సర్వీస్‌రోడ్డుపై గత కొద్దిరోజులుగా భారీగా మురుగునీరు నిల్వ ఉంది. దీంతో పరిసర ప్రాంతాల్లో కంపు కొడుతుండడంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రుద్రంపేట సర్కిల్ నుంచి నాలుగో పట్టణ పోలీసుస్టేషన్ వైపు వెళ్లే హైవే సర్వీసు రోడ్డుపై ఎక్సోటిక్కా రెస్టారెంట్ సమీపంలో మురుగునీరు గత కొన్నిరోజులుగా పెద్ద ఎత్తున నిల్వ ఉంటోంది. అక్కడి పైభాగంలోని ఇళ్లు, హోటళ్లు, అపార్ట్‌మెంట్లు ఇతరత్రా వాటి నుంచి వచ్చే మురుగు నీరు సర్వీసు రోడ్డు పక్కనున్న కాలువలోకి వచ్చి కలుస్తున్నాయి. ఆ కాలువలో మురుగునీరు ముందుకు వెళ్లలేక రోడ్డుపైకి వచ్చి నిల్వ ఉంటున్నాయి. అక్కడున్న మోరీ కింద కూడా మురుగునీరు ముందుకెళ్లలేక అలాగే నిల్వ ఉండిపోయాయి. వాటి నుంచి తీవ్ర దుర్గంధం వస్తుండడంతో వాహనదారులు, స్థానికులు అసౌకర్యానికి గురవుతున్నారు. గతనెలలో కురిసిన వర్షాలకు ఆ ప్రాంతంలో మడుగును తలపించింది. రాకపోకలు సాగించడానికి వాహనదారులు నానా అవస్థలు పడ్డారు. అయినా సంబంధిత అధికారులకు స్పందించలేదు. ఇప్పటికైనా మేల్కొని సమస్యను పరిష్కరించేందుకు చొరవ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మంత్రి లోకేశ్‌ను కలిసిన జనసేన నాయకుడు



మంత్రి లోకేశ్‌తో జనసేన నాయకుడు కొండిశెట్టి ప్రవీణ్‌కుమార్

శింగనమల/ అనంతపురం న్యూటౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ శింగనమల నియోజకవర్గ నాయకుడు కొండిశెట్టి ప్రవీణ్ కుమార్ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిశారు. విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎస్సీ నియోజకవర్గమైన శింగనమల అభివృద్ధికి అధిక నిధులు మంజూరు చేయాలని కోరామన్నారు. ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తున్నారని, అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించాలని విన్నవించినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపునకు తగిన చర్యలు తీసుకుంటామని లోకేశ్‌కు విన్నవించినట్లు ఆయన పేర్కొన్నారు.

'ప్రభుత్వ భూమిలో గుడిసెలు తొలగించాలి'



గుడిసెలు వెసుకున్న వారితో మాట్లాడుతున్న తహసీల్దార్

అనంతపురంరూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరపల్లి గ్రామ సమీపంలో గల సర్వే నంబర్ 215లోని వంకపోరంబోకు భూమిలో గుడిసెలు తొలగించుకోవాలని రెవెన్యూ, పోలీసు అధికారులు సూచించారు. అధికారులు గురువారం ఆ భూమి వద్దకు వెళ్లి గుడిసెలను పరిశీలించారు. అనంతరం వాటిని వేసుకున్న వారితో తహసీల్దార్ మోహన్‌కుమార్ మాట్లాడుతూ.. ఈ భూమిలో ఓబుల్‌రాజుతోపాటు మరికొందరు గ్రామస్థులను మభ్యపెట్టి ఈ గుడిసెలు వేయించినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అంతేకాకుండా గుడిసెలు వేసుకున్న వారితో డబ్బులు వసూలు చేసినట్లు తెలిసిందన్నారు. ప్రభుత్వ భూమిని అన్యాక్రాంతం చేస్తూ చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడడం సరికాదన్నారు. దీనిపై ఇటుకలపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందన్నారు. ఆ భూమి లో ఎవరికీ ఇళ్ల పట్టాలిచ్చేది లేదన్నారు. దానిని ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వేసిన గుడిసెలను 24 గంటల్లో తొలగించాలని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇటుకలపల్లి ఎస్ఐ, పోలీసులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సందీప్‌కృష్ణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సజ్జలకాలువలో స్వమిత్వ సభ

అనంతపురం రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నంపల్లి పంచాయతీ సజ్జలకాలువ గ్రామంలో గురువారం సర్పంచు శిశశంకర్ అధ్యక్షతన స్వమిత్వ గ్రామ సభ జరిగింది. కార్యక్రమానికి డీఎల్‌డీఓ నాగశివలీల, ఎంపీడీఓ దివాకర్, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మాలపాటి రాము హాజరయ్యారు. ఈసందర్భంగా పంచాయతీలో అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. త్వరలోనే ప్రతి ఇంటికి స్వమిత్వ కార్డులు అందజేయనున్నట్లు డీఎల్‌డీఓ నాగ శివ లీల తెలిపారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రతి ఒక్కరి సహకారం అవసరమని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చరణ్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ కవిత, సర్వేయర్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ పరీక్షల కేంద్రం పరిశీలన



ల్యాబ్‌ను పరిశీలిస్తున్న ఆర్జేడీ డాక్టర్ కామేశ్వరప్రసాద్

అనంతపురం వైద్యం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ మెడికల్ కళాశాలలో కాలిపోయిన ఎయిడ్స్ పరీక్షల కేంద్రాన్ని ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ(ఏపీసాక్స్) జేడీ డాక్టర్ కామేశ్వర ప్రసాద్ పరిశీలించారు. గురువారం కళాశాలకు చేరుకున్న ఆయన ప్రిన్సిపాల్ విజయశ్రీ, ఇతర అధికారులతో కలిసి ఘటనపై ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ నివేదికలు ప్రభుత్వానికి పంపనున్నట్లు తెలిపారు.

పారిశుధ్యం మెరుగుపడాలి: జడ్పీ సీఈఓ



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ సీఈఓ శివశంకర్

అనంతపురం న్యూటౌన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లాలో పారిశుధ్యం మెరుగుపడాలని, అందుకనుగుణంగా చర్యలు చేపట్టాలని జిల్లా పరిషత్ సీఈఓ శివశంకర్ సూచించారు. పరిశుభ్రమైన పచ్చని గ్రామాలు అనే అంశంపై ఉమ్మడి జిల్లాలోని డిప్యూటీ ఎంపీడీఓలకు గురువారం స్థానిక జడ్పీ కార్యాలయంలో శిక్షణను ఏర్పాటు చేశారు. కార్యమానికి సీఈఓ శివశంకర్, డీడీఓ నాగశివలీల, డీపీఓ నాగరాజనాయుడు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. సీఈఓ మాట్లాడుతూ.. పంచాయతీల్లో పారిశుధ్య మెరుగుకు చేపట్టాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. జిల్లాలో ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నా పారిశుధ్యం మెరుగు పడటం లేదన్నారు. మంచి ఫలితాలు రావాలంటే అందుకు అనుగుణంగా ఎవరి పరిధిలో వారు తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సచివాలయంలో పని చేసే ప్రతి సిబ్బందిని భాగస్వాములను చేయాలన్నారు. ఎవరి బాధ్యతలు వారికి అప్పగించి ఫలితాలు రాబట్టాలన్నారు. పారిశుధ్యం మెరుగుకు సంబంధిత సచివాలయం పరిధిలోని ఇంటి యజమానులకు సంబంధించి ఒక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేయాలని, కమిషనర్ నుంచి వచ్చే అంశాలను మీకు పంపుతామని, వాటిని ప్రజలకు చేరేలా వాయిస్ మేసేజ్ పంపే ప్రయత్నం చేయాలని సూచించారు. ఇలా ప్రజల్లో అవగాహన కల్పించినట్లు అయితే మార్పు సాధ్యమన్నారు. అందుకు అనుగుణంగా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

కుష్ఠుపై అవగాహన

నార్పల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలో బి. పప్పూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ హాజీర ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది గురువారం కుష్ఠు వ్యాప్తి, దాని నివారణపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ లేప్రే అనే మైక్రో బ్యాక్టీరియా నుంచి ఆ వ్యాధి వ్యాప్తి చెందుతుందన్నారు. అది ముఖ్యంగా చర్మానికి, నరాలకు వ్యాపిస్తుందన్నారు. నివారణ చర్యలు పాటిస్తే ఖచ్చితంగా తగ్గిపోతుందని తెలిపారు. ఈనెల 17నుంచి ఈ వ్యాధి గుర్తింపునకు ఇంటింటా సర్వేను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ మల్లికార్జున, పీహెచ్ఎన్ హేమలత తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

గార్లదిన్నె, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కల్లూరు. లోలూరు సమీపంలోని 44వ జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు కల్లూరుకు చెందిన రాము, వెంకటేష్ అనే ఇద్దరు ద్విచక్ర వాహనంలో తరిమెల క్రాస్ వద్ద రోడ్డు దాటుతుండగా కారు, ద్విచక్ర వాహనం ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తున్న ఇద్దరు గాయపడ్డారు. అదేవిదంగా గుడివాడకు చెందిన చైతన్య బెంగుళూరులో సాఫ్ట్‌వేరు ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. బుధవారం హైదరాబాద్ నుంచి బెంగళూరుకు ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తుండగా లోలూరు క్రాస్ వద్ద అదుపుతప్పి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రులను స్థానికులు చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ట్రాక్టర్ యజమానుల ఆందోళన



తహసీల్దార్ కార్యాయలం వద్ద ఆందోళన్న ట్రాక్టర్ యజమానులు

బుక్కరాయసముద్రం,నవంబరు13(ఆంధ్రజ్యోతి): పోలీసులు, రెవెన్యూ అధికారులు కూలీలకు ఉపాధిలేకుండా చేసి వారి పొట్టకొడుతున్నారని మండల కేంద్రంలో ట్రాక్టర్ల యజమానులు తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ఆందోళన చేపట్టారు. ట్రాక్టర్ల యజమానుల అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ గత పది రోజులుగా పోలీసులు, రెవెన్యూ అధికారులు ట్రాక్టర్లపై దాడులు చేసి తమను ఆర్థికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఎర్రమట్టిని కూలీలు గడ్డపారతో తవ్వి వేసుకుని వస్తుంటే అక్రమంగా అరెస్టు చేసి స్టేషన్‌లో పెడుతున్నారన్నారు. తాము ఎక్స్‌కవేటర్లతో తవ్వడం లేదన్నారు. తమకు, కూలీలకు జరిగే అన్యాయంపై కలెక్టరేట్ కార్యాలయం వద్ద కూడా ఆందోళన చేస్తామని వారు పేర్కొన్నారు. వారికి సహకారసొసైటీ చైర్మన్ కేశన్న , మాజీసర్పంచ్ లక్ష్మినారాయణలు పలికారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం క్రైం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఇద్దరు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పంపిణీ చేశారు. బ్రహ్మసముద్రం మండలం పాలవెంకటాపురం గ్రామానికి చెందిన మంజులకు రూ. 40,569లు, నార్పల మండలం బొందలవాడ గ్రామానికి చెందిన సూర్యనారాయణకు రూ.25178(చొప్పున సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరయింది. ఇందుకు సంబంధించిన చెక్కులను ఎంపీ అంబికా నగరంలోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం వారికి అందజేశారు. అనంతరం లబ్ధిదారులు సీఎం చంద్రబాబుకు, ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయ ప్రారంభోత్సవ బ్రోచర్ల విడుదల



బ్రోచర్లను విడుదల చేస్తున్న స్వామీజీలు

అనంతపురంటౌన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక హెచ్చెల్సీ కాలనీలో నిర్మించిన రామకృష్ణ విశ్వజనీన దేవాలయ ప్రారంభోత్సవ వేడుకలు ఈనెల 28, 29, 30వ తేదీల్లో జరగనున్నాయి. అందుకు సంబంధించిన బ్రోచర్లను రామకృష్ణ మఠం ప్రతినిధులు సుకృతానంద మహరాజ్, అనుపమానంద మహరాజ్ స్వామీజీలు గురువారం రామకృష్ణ సేవాసమితి కార్యాలయ ఆవరణలో ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ భక్తులు పెద్దఎత్తున పాల్గొని ప్రారంభోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో శ్రీకృష్ణ శేషి, వేదాద్రి ప్రవీణ్‌కుమార్, శ్రీధరమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎరువు గుంతలు తవ్వుకోండి: ఎంపీడీఓ

గార్లదిన్నె, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని ప్రజలు తమ ఇళ్ల వద్ద ఎరువు (కంపోస్టు) గుంతలు తవ్వుకోవాలని ఎంపీడీఓ యోగానందరెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లోని ఇళ్ల పరిసర ప్రాంతాల్లో అపరిశుభ్రత లేకుండా ఉంచేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. దీంతో ఉపాధి పథకం ద్వారా ఇళ్ల వద్ద గుంతలు తవ్వుకునేందుకు శ్రీకారం చుట్టిందన్నారు. ఎరువు గుంతలను ఉపాధి పథకం ద్వారా తవ్వుకోవచ్చన్నారు. గుంతలు తవ్వుకుని ఇళ్ల పరిసర ప్రాంతాల్లోని చెత్తను, వ్యర్థాలను వాటిల్లో వేయాలని సూచించారు. కొద్దిరోజులకు ఆ చెత్తను, వ్యర్థాలను ఎరువుగా మార్చుకొని పంటలకు వినియోగించుకోవచ్చని చెప్పారు. వ్యవసాయ తోటల్లో కూడా ఈ గుంతలు ఏర్పాటు చేసుకుని ఎరువును తయారు చేసుకోవచ్చునన్నారు. ఎరువు గుంతుల తవ్విన వారికి ప్రభుత్వం డబ్బు చెల్లిస్తుందన్నారు. ఎరువు గుంతల ఏర్పాటుపై మండల ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. పాడి పశువులు ఉన్న వారు 6అడుగులు పొడవు, 6 అడుగులు వెడల్పు, 6 అడుగులు లోతు చొప్పున ఎరువు గుంతలను తవ్వుకోవాలన్నారు. ఒక్కో గుంతకు ప్రభుత్వం రూ.1500 చొప్పున బిల్లు చెల్లిస్తుందన్నారు. పశువులు లేని వారు 3 అడుగుల పొడవు, 3 అడుగుల వెడల్పు, 3 అడుగులు లోతుతో గుంతలను తవ్వుకోవాలన్నారు. వారికి రూ. 900 చెల్లించడం జరుగుతుందన్నారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ తవ్వుకోవచ్చునన్నారు. ఆసక్తి గల వారు వెంటనే సంబంధిత అధికారులను సంప్రదించాలని కోరారు.

' వెంకటప్ప నియామకం హర్షణీయం'



వెంకటప్పను సన్మానిస్తున్న భవాని రవికుమార్

అనంతపురం న్యూటౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎస్టీ కమిషన్ మెంబర్‌గా వెంకటప్పను కూటమి ప్రభుత్వం నియమించడం హర్షణీయమని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ భవాని రవికుమార్ అన్నారు. స్థానిక మల్లేశ్వరి రోడ్డులో గల తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన రాష్ట్ర ఎస్టీ కమిషన్ మెంబర్‌గా నియమితులైన వెంకటప్పను పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో కష్టపడిన వారికి తగిన న్యాయం జరుగుతుందనడానికి వెంకటప్ప నిదర్శనమన్నారు. గుత్తి నియోజకవర్గంలోని ఎర్రగుడి గ్రామానికి చెందిన వెంకటప్ప విద్యార్థి దశ నుంచి టీడీపీ కోసం కష్టపడి పని చేశారన్నారు. అందుకు తగ్గట్టుగానే ఇప్పుడు తగిన ఫలితం దక్కిందన్నారు. కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రాయల్ మురళీ, నాయకులు గల్లా హర్షసాయి సంపత్, చిన్న పాల్గొన్నారు.

'అక్రమ కేసులు పెడితే ఉపేక్షించం'

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): వైసీపీలో యాక్టివ్‌గా ఉంటే పోలీస్‌స్టేషన్లకు పిలిపించి కేసులు పెడతామని బెదిరిస్తే చూస్తూ ఊరుకోమని ఆ పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ అన్నారు. గురువారం వైసీపీకి చెందిన కొందరిని త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారు. వారిపై పోలీసులు చేయి చేసుకున్నారని వైసీపీ నాయకులు ఆరోపించారు. ఈ విషయం జిల్లా అధ్యక్షుడు అనంతవెంకటరామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం లీగల్ సెల్ నాయకులతో కలిసి త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. అక్కడ సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్‌తో సాకే చంద్రశేఖర్ మాట్లాడారు. పాత కేసులున్న వారిని పిలిపించామని సీఐ చెప్పగా...ఒక్క కేసు కూడా లేని వాళ్లను ఎలా తీసుకొచ్చారని వైసీపీ నాయకులు ప్రశ్నించారు. అనంతరం సాకే చంద్రశేఖర్ విలేకరులతో మాట్లాడుతూ... అనంతపురంలో ర్యాలీలో పాల్గొన్నందుకే పోలీసులను అడ్డుపెట్టుకుని వైసీపీ నాయకులను స్టేషన్‌కు పిలిపించారన్నారు. ఇదే పద్ధతి కొనసాగితే లీగల్‌గా పోరాటం చేస్తామన్నారు. లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు ఉమాపతితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

దొరికిన దుండగుడు!

అనంతపురం వైద్యం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఏఎంసీ వార్డులో విద్యుత్ వైర్లను కత్తిరించి విద్యుత్ సరఫరాలో అంతరాయానికి కారణమైన దుండగుడు పట్టుబడినట్లు సమాచారం. సీసీ కెమెరాల ఆధారంగా దుండగున్ని గుర్తించి విచారిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదివరకే ఆస్పత్రిలో చిన్నచిన్న దొంగతనాలకు పాల్పడిన వ్యక్తే విద్యుత్‌వైర్లను కత్తిరించాడని ప్రచారం జరుగుతోంది. త్వరలోనే పూర్తి సమాచారం తెలుస్తుందని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు



శింగనమలలో విద్యార్థులతో కలిసి పోస్టర్లు విడుదల చేస్తున్న గ్రంథాలయాధికారి

గార్లదిన్నె, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. అందుకు సంబంధించిన పోస్టర్లను మండలకేంద్రంలో గురువారం ఎంఈఓలు తారా చంద్రానాయక్, వెంకటరమణ నాయక్, గ్రంథాలయ అధికారి శిరీష, ఎంపీడీఓ యోగానందరెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గ్రంథాలయాల వారోత్సవాలు ఈనెల 20 వరకు జరుగుతాయన్నారు. వీటిల్లో భాగంగా 14న బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, పుస్తక పఠన ప్రాముఖ్యత, 16న గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న నాయకులను స్మరించుకోవడం, 17న కవి సమ్మేళనం, సెమినార్లు, వక్తృత్వ పోటీల నిర్వహణ, 19న మహిళా సాధికారతపై అవగాహన, 20న డిజిటల్ గ్రంథాలయాలపై అవగాహన తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. విజయవంతం చేయాలని కోరారు.

●శింగనమల: మండలకేంద్రంలో గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్లను గ్రంథాలయ అధికారి కృష్ణ స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో కలిసి విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ వారోత్సవాల్లో విద్యార్థులు పాల్గొనాలని కోరారు.

●కనగానపల్లి: మండలకేంద్రంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు విజయవంతం చేయాలని గ్రంథాలయాధికారిణి నాగమణి పాఠకులను కోరారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ 58వ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

●నార్పల: మండలకేంద్రంలోని గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ కావేరి మాట్లాడుతూ ఈ వారోత్సవాల్లో భాగంగా 14వ తేదీనుంచి విద్యార్థినీ, విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి చివరి రోజైన 20వ తేదీ బహుమతులను ప్రదానం చేస్తామని తెలిపారు.

న్యూస్ బాక్స్

జాతీయస్థాయి ఖో-ఖో పోటీలకు స్వప్న



కణేకల్లు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): విజయనగరంలో మంగళవారం నిర్వహించిన రాష్ట్రస్థాయిలో ఖోఖో పోటీల్లో స్థానిక మోడల్‌స్కూల్‌లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న స్వప్న ప్రతిభ చాటింది. డిసెంబరులో ఉత్తరప్రదేశ్‌లో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు ప్రిన్సిపాల్ రెహనాబేగం, పీడీ రమేష్ తెలిపారు.

నేటి నుంచి సదరం క్యాంపులు

బెళుగుప్ప, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలో సదరం క్యాంపులను శుక్రవారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ లక్ష్మీనారాయణ ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులకు పింఛన్లు పొందడానికి అర్హత సర్టిఫికెట్లు మంజూరు చేస్తామనీ, అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పూల తోటలు తొలగించకండి

తాడిపత్రి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక పెన్నానది పరివాహక ప్రాంతంలో దశాబ్దాలుగా అనేక మంది రైతులు పండ్ల, పూల తోటలు సాగుచేసుకొంటున్నారని, రెవెన్యూ అధికారులు ఆ తోటలను తొలగించేలా చర్యలు చేపట్టడం బాధాకరమని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రంగయ్య అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. అధికారులు తమ చర్యలను ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వీటీ రామాంజనేయులు, నాయకులు నారాయణరెడ్డి, గోపాలకృష్ణ, రామేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

కుందుర్పిని కరువు మండలంగా ప్రకటించాలి

కుందుర్పి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కుందుర్పిని కరువు మండలంగా ప్రకటించాలని సీపీఐ నాయకులు తహసీల్దార్ ఓబులేష్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. ఇందులో సీపీఐ నాయకులు హరిదాసులు శామిల్, గోపాల్ కమ్యూనిస్టు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంట నష్టంపై ఆరా

వజ్రకరూరు (ఉరవకొండ), నవంబరు 13(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలం ధర్మపురి గ్రామానికి చెందిన కేశవరెడ్డి, రామిరెడ్డి, ధనలక్ష్మి, హనుమంతరెడ్డి 48 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. అవి నకిలీ పత్తి విత్తనాలు కావడంతో వారు రూ.23 లక్షలదాకా నష్టపోయారు. దీనిపై ఈ నెల 10న ఆంధ్రజ్యోతి ఓ కథనాన్ని ప్రచురించింది. దీంతో రెడ్డిపల్లి కృషి విజ్ఞానశాస్త్రవేత్తలు మల్లేశ్వరి, కిషోర్ కుమార్ రెడ్డి గురువారం ఆ పంటను పరిశీలించారు. నష్టానికి గల కారణాలను జిల్లా వ్యవసాయాధికారికి నివేదిక పంపుతామన్నారు. వారి వెంట ఏడీఏ సత్యనారాయణ, ఏఓ మధుకర్, టెక్నికల్ ఏఓ భరత్ ఉన్నారు.

గౌరీదేవి నిమజ్జనం

బెళుగుప్ప, నవంబరు13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గౌరీదేవి నిమజ్జనం కార్యక్రమాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలో శివాలయం వద్ద గౌరీదేవికి తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు చేశారు. గురువారం భక్తులు కోలాటాలు, జ్యోతులతో అమ్మవారిని ఊరేగిస్తూ.. నిమజ్జనం చేశారు.

కాంప్లెక్స్, డీఏపీ కొంటేనే యూరియా..

శెట్టూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కాంప్లెక్స్ ఎరువులు, డీఏపీ కొంటేనే యూరియా బస్తాలు ఇస్తామని ఎరువుల దుకాణదారులు చెబుతున్నారంటూ రైతులు వాపోతున్నారు. మండలంలో 16 గ్రామ పంచాయతీల్లో మొక్కజొన్న, వేరుశనగ, వరి తదితర పంటలను సాగు చేశారు. మొక్కజొన్న పంటకు యూరియా అధికంగా కావాల్సి ఉండటంతో రైతులు ఎరువుల దుకాణాలను ఆశ్రయిస్తున్నారు. కాంప్లెక్స్ ఎరువులు కొంటేనే యూరియా బస్తాలు ఇస్తామని ఎరువుల దుకాణదారులు చెబుతున్నారని, జిల్లా అధికారులు స్పందించి.. సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

వైభవంగా వార్షికోత్సవ పూజలు



హోమంలో పాల్గొన్న భక్తులు

బెళుగుప్ప, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక విఘ్నేశ్వర ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ వార్షికోత్సవ పూజలను గురువారం ఘనంగా నిర్వహించారు. వేదపండితుడు రాంబాబు ఆధ్వర్యంలో ఏకవర పంచామృత అభిషేకం, రుద్రాభిషేకం, గణపతి హోమం, నవగ్రహ హోమం, మహా సుదర్శన హోమం, పూర్ణాహుతి చేశారు.

ప్రధాన రహదారిలో భారీ గొయ్యి



రోడ్డు మధ్యలో ఏర్పడ్డ గొయ్యి

కణేకల్లు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని బెణికల్లు-సీతారామ్‌నగర్ క్యాంప్‌ల మధ్య ఉన్న ప్రధాన రహదారిలో గురువారం సాయంత్రం పెద్ద గొయ్యి ఏర్పడింది. ప్రతి నిత్యం బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు తిరిగే ఈ రహదారి మధ్యలో గొయ్యి ఏర్పడడంతో స్థానికులు అప్రమత్తమయ్యారు. ప్రమాదాలు జరగకుండా.. గొయ్యి కనబడేలా.. ముళ్లకంపలు ఉంచారు.

బాధిత కుటుంబానికి చేయూత



సరుకులు అందజేస్తున్న సభ్యులు

పామిడి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ కాలనీ వాసి అంచాల్కర్ నాగేంద్రరావు ఆదివారం అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న లాల్ బాగ్ ఛా రాజా ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు ఆ కుటుంబానికి గురువారం రూ.9 వేలు ఆర్థికసాయం అందజేశారు. అలాగే రూ. 10 వేలు విలువ గల నిత్యావసర సరుకులు అందజేశారు.

సబ్సిడీ పప్పుశనగ విత్తనాల కోసం నిరీక్షణ

● ఇటీవల కురిసిన వర్షాలకు కుళ్లిన పంట ● మరోసారి సాగుకు సిద్ధమైన రైతులు

యల్లనూరు, నవంబరు13(ఆంధ్రజ్యోతి): సబ్సిడీ పప్పుశనగ విత్తనాల కోసం మండల రైతులు నిరీక్షిస్తున్నారు. నెల క్రితం పదును వర్షం కురవడంతో సుమారు నాలుగు వేల ఎకరాల్లో ఈ పంటను సాగుచేశారు. వరుస వర్షాల కారణంగా సాగుచేసిన పప్పుశనగ పొలాల్లో మొలకలు రావడంతో పాటు తెగుళ్లు కూడా కనిపిస్తున్నాయి. మరికొన్ని చోట్ల పంట కుళ్లిపోయింది. దీంతో రైతులు మరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి పప్పుశనగను మరోసారి సాగుచేయడానికి సిద్ధమయ్యారు. మండలంలో సుమారు ఆరు వేల ఎకరాల్లో ఈ పంట ప్రతి సంవత్సరం సాగవుతుంది. ఇందులో సుమారు నాలుగు వేల ఎకరాలకు పైగా విత్తనం వేయగా రెండు వేల ఎకరాలు మిగులు ఉంది. సబ్సిడీ ధర నిర్ణయించినప్పటికి ప్రభుత్వం విత్తనాలను సరఫరా చేయలేదు. రైతులు వ్యవసాయాధికారులను సంప్రదించినా వారి నుంచి సరైన సమాధానం రావడం లేదు. మండలంలో కాచర్లకుంట, జంగంపల్లి, పాతపల్లి, కృష్ణాపురం, వెన్నపూసపల్లి, వెంకటాద్రిపల్లి,



కృష్ణాపురంలో వర్షానికి కుళ్లిన పంట

యల్లనూరు గ్రామాల్లో నల్లరేగడి నేలలు అధికంగా ఉన్నాయి. ఈ నేలల్లో ఏటా పప్పుశనగ మాత్రమే సాగుచేస్తారు. జిల్లా వ్యవసాయాధికారులు స్పందించి త్వరగా సబ్సిడీ విత్తనాలను సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. కొంతమంది రైతులు మార్కెట్‌లో క్వింటా పప్పుశనగ రూ.6300కు కొనుగోలు చేసి.. విత్తనం వేశారు. ప్రస్తుతం సబ్సిడీ విత్తనాలు ఇవ్వకపోతే ఈ ధర మరింత పెరిగే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు.

రిజిస్ట్రేషన్ ప్రారంభించాలి



కర్నూలు, నంద్యాల, కడప జిల్లాల్లో ఇప్పటికే రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. రైతులకు సబ్సిడీపై విత్తనాలను అందించడానికి డబ్బులు కూడా రైతులు చెల్లిస్తున్నారు. మన జిల్లాలోని వ్యవసాయ ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని వెంటనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించాలి.

-సునీల్, రైతు, కాచర్లగుంట

ఆదేశాలు రాగానే..

ఇంతవరకు పప్పుశనగ సబ్సిడీపై ఎటువంటి ఉత్తర్వులు మాకు రాలేదు. ఉత్తర్వులు రాగానే రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించి విత్తనం సరఫరా చేస్తాం.

-కిరణ్‌కుమార్‌రెడ్డి, ఏఓ

తూతూమంత్రంగా విద్యుత్ అదాలత్



ఉరవకొండలో ఖాళీగా ఉన్న కుర్చీలు



కూడేరులో ఫిర్యాదులు స్వీకరిస్తున్న రిటైర్డ్ న్యాయాధికారి

ఉరవకొండ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ట్రాన్స్‌కో కార్యాలయం ఆవరణంలో గురువారం నిర్వహించిన విద్యుత్ అదాలత్ తూతూ మంత్రంగా నిర్వహించారు. విద్యుత్ వినియోగదారులకు సమాచారం ఇవ్వలేదు. దీంతో లైన్‌మెన్‌లు, ఎనర్జీ అసిస్టెంట్‌లతో సమావేశాన్ని నిర్వహించి మమ అనిపించారు. ఇందులో రిటైర్డ్ న్యాయాధికారి శ్రీనివాస ఆంజనేయమూర్తి, ఆర్థిక సభ్యులు మధుకర్, సాంకేతిక సభ్యులు శ్రీనివాస్ బాబు, స్వతంత్ర సభ్యు లు విజయలక్ష్మి, ఏఈ సత్యం పాల్గొన్నారు.

● కూడేరు: స్థానిక విద్యుత్ స్టేషన్‌లో ప్రత్యేక విద్యుత్ అదాలత్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. రిటైర్డ్ న్యాయాధికారి శ్రీనివాస ఆంజినేయమూర్తి, మెంబర్లు మధుకుమార్, శ్రీనివాసబాబు, విజయలక్ష్మి, ఏఈ గౌస్‌మోద్దీన్ ఫిర్యాదులు స్వీకరించారు. జేఎల్‌ఎం (జూనియర్ లైన్‌మెన్) సక్రమంగా పని చేయడంలేదని రైతులు ఫిర్యాదు చేశారు.

చెరువులకు నీటి విడుదల



నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే

పుట్లూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుబ్బరాయసాగర్ నుంచి పుట్లూరు, కోమటికుంట్ల, గరుగుచింతలపల్లి గ్రామాల చెరువులకు నీటిని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ గురువారం విడుదల చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ చెరువులతోపాటు 29వ డిస్ట్రిబ్యూటరీ ద్వారా చివరి ఆయకట్టు అయిన బొప్పేపల్లి చెరువుకు కూడా నీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ సుదర్శన్‌నాయుడు, సింగిల్‌విండో డైరెక్టర్ గోవర్ధన్‌రాజు, నాయకులు ఓబులాపురం శ్రీనివాసులునాయుడు, చవ్వా కులశేఖర్‌రెడ్డి, శివరామయ్య, ఆదినారాయణరెడ్డి, శివశంకర్‌రెడ్డి, రామాంజనేయులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

గుంతకల్లు టౌన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణలో మీడియా పాత్రపై స్థానిక ఎస్కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు గురువారం వ్యాసరచన పోటీలను నిర్వహించారు. విజేతలకు ఈనెల 16న బహుమతులను ప్రదానం చేస్తారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ నియోజకవర్గ అధ్యక్షుడు జీఎం రఫీ, పట్టణ ప్రధాన కార్యదర్శి బీ వెంకటరాముడు, ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య, వైస్ ప్రిన్సిపాల్ రవి శంకర్‌శర్మ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణం తనిఖీ

గుంతకల్లు టౌన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నదాత ఫర్టిలైజర్ దుకాణాన్ని మండల వ్యవసాయ అధికారి డీ లీనా వసుంధర గురువారం తనిఖీ చేశారు. రైతులకు ఇచ్చే క్యాష్ మెమోలో రైతుల సంతకాలు, డీలర్ సంతకం లేని కారణంగా, భౌతిక నిలువలకు స్టాక్ రిజిస్టర్ నిలువకు తేడా ఉన్న కారణంగా రూ. 1,92,300 విలువైన మందులను సీజ్ చేశారు. అనుమతులు లేని పురుగు మందులు, స్టాక్‌లోలేని రూ.50,99,296 విలువ గల పురుగు మందుల అమ్మకాలను నిలుపుదల చేశారు.

వారంలోగా ఈకేవైసీ పూర్తి చేయాలి: పీడీ



బొమ్మనహాళ్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న పీడీ

రాయదుర్గం రూరల్/బొమ్మనహాళ్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రతి ఉపాధి కూలీకి తప్పనిసరిగా వారంలోగా ఈకేవైసీ చేయించాలని ఉపాధి హామీ పీడీ సలీంబాషా అధికారులకు సూచించారు. రాయదుర్గం, బొమ్మనహాళ్ ఎంపీడీఓ కార్యాలయాల్లో ఉపాధిహామీ సిబ్బందితో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 4,37,442 మంది కూలీలు పనులకు వస్తుండగా.. ఇప్పటివరకు 3,37,442 మంది (82.92 శాతం) ఈకేవైసీ చేసేశామన్నారు. జిల్లాలో హార్టికల్చర్ కింద మునుగుసాగుకు రాయదుర్గం, బ్రహ్మసముద్రం మండలాలను పైలట్ ప్రాజెక్టుగా తీసుకున్నట్లు తెలిపారు. బొమ్మనహాళ్, కణేకల్లు మండలాల్లోని గోవిందవాడ, దర్గాహొన్నూరు, బిదురుకొంతం, మినహళ్లి తదితర గ్రామ శివారులోని ఇసుకను తరలించడానికి వీలుకాదని, ఆ ఇసుక దిబ్బల్లోనే పండ్ల తోటలు సాగు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని, దీన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పథకం కింద ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరుకు చెందిన రూ. 41 కోట్ల బిల్లులు బకాయిలుగా ఉన్నాయన్నారు.

నెట్టికంటి సేవలో ఏపీ దేవదాయశాఖ రాష్ట్ర స్థపతి



గర్భాలయ మ్యాపును పరిశీలిస్తున్న స్థపతి

గుంతకల్లుటౌన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామిని ఆంధ్రప్రదేశ్ దేవదాయ శాఖ రాష్ట్ర స్థపతి పరమేశ్వరప్పస్వామి గురువారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, వేదపండితులు, అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. ఆలయంలో రాతితో నిర్మించనున్న గర్భాలయం ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ మేడేపల్లి విజయరాజు, అనువంశిక ధర్మకర్త సుగుణమ్మ, కర్నూలు స్థపతి సుబ్రహ్మణ్యం, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

నేడు 'ప్రజల కోసం ఎమ్మెల్యే'

గుంతకల్లు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక కసాపురం రోడ్డులోని శ్రీచక్ర అపార్టుమెంటు నందు ఉన్న టీడీపీ కార్యాలయంలో ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం శుక్రవారం ఫిర్యాదులు స్వీకరిస్తారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (సీజీఆర్‌ఎస్)లో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ ఎమ్మెల్యే అందుబాటులో ఉంటారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నాయకులు కోరారు.

విద్యార్థులకు సైకిళ్ల అందజేత

బొమ్మనహాళ్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉద్దేహాళ్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చదువుతున్న 30 మంది తిమ్మలాపురం, బండూరు విద్యార్థులకు సైకిళ్లను విప్ కాలవ శ్రీనివాసులు గురువారం పంపిణీచేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో పంపిణీ చేయగా.. మిగిలిన సైకిళ్లను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ మల్లికార్జున, ప్రధానోపాధ్యాయుడు ఆదిశేషు, టీడీపీ నాయకులు మల్లికార్జున, సల్లపురం బాబు, నవీన్, సంగప్ప, నాగరాజు, సైకిల్ షాపు హనుమంత, మహేంద్ర, మోహన్, నారాయణస్వామి, కేశప్ప, గాలి బసప్ప, బెళ్లి హనుమంతరెడ్డి, సీఆర్‌పీ అమరేష్ పాల్గొన్నారు.

● వైద్య శిబిరం..

మండలంలోని శ్రీనివాసక్యాంప్‌లో కిడ్నీ, మూత్రకోశ వ్యాధిగ్రస్థుల కోసం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని విప్ ప్రారంభించారు. రైతు కుటుంబంలో పెరిగిన శ్రీనివాసరావు బెంగళూరులో స్థిరపడి ప్రఖ్యాత వైద్యుడిగా సేవలు అందిస్తూ.. అతని తండ్రి పాలడుగు కొండయ్య నాయుడు జ్ఞాపకార్థం ఆయన ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించడం హర్షించదగ్గ విషయమన్నారు. దాదాపు 300 మందికి ఈ శిబిరంలో వైద్య పరీక్షలు చేశారు. ఇందులో తహసీల్దార్ మునివేలు, ఎంపీడీఓ విజయభాస్కర్, తనా మాజీ అధ్యక్షుడు సతీష్, టీబీ ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ కేశవరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ బలరాంరెడ్డి, సింగల్ విండో చైర్మన్ కొత్తపల్లి మల్లికార్జున, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



ఉద్దేహాళ్‌లో సైకిళ్లను పంపిణీ చేస్తున్న విప్

క్రైం న్యూస్..

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

గుంతకల్లు టౌన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక అరవై అడుగుల రోడ్డులోని సుధాకర్ రెడ్డి కోళ్లఫారం సమీపంలో నివాసముంటున్న షేక్ సైఫుల్లా (36) తన ఇంట్లో ఉరేసుకొని గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. గతంలో ఇతను సాఫ్‌వేర్ ఉద్యోగం చేసేవాడు. ప్రస్తుతం షుగర్, మూర్చ తదితర వ్యాధులతో బాధపడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెందిన ఆయన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. షేక్ సైఫూల్లాకు భార్య షేక్ గౌసియాబేగం, ఒక పాప ఉన్నారు. టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముదిగల్లులో వృద్ధురాలు..

కళ్యాణదుర్గంరూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధిలోని ముదిగల్లు గ్రామ వాసి గొల్ల దుర్గమ్మ (61) బుధవారం రాత్రి ఆత్మహత్య చేసుకుంది. మానసిక పరిస్థితి సరిగా లేని ఆమె.. కొద్ది రోజులుగా కడుపు నొప్పితో బాధపడుతోంది. దీంతో జీవితంపై విరక్తి చెందిన ఆమె చీరతో ఉరేసుకొని.. ఆత్మహత్య చేసుకుంది. గురువారం ఉదయం విషయాన్ని కుటుంబ సభ్యులు గుర్తించారు. దుర్గమ్మకు భర్త ఈరనాగప్ప, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దొంగకు దేహశుద్ధి



నిందితుడు

గుత్తి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బండగేరి, కురవవీధిల్లోని పలు ఇళ్లలో గురువారం తెల్లవారుజామున ఓ దుండగుడు ఐదు సెల్‌ఫోన్లు, కొంత నగదును చోరీ చేశాడు. గమనించిన స్థానికులు అతన్ని పట్టుకొని.. దేహశుద్ధి చేసి.. ఆ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. అతన్ని పోలీసులకు అప్పగించారు. దుండగుడి వివరాలు తెలియాల్సి ఉంది.

మద్యం ధ్వంసం

కూడేరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పలు కేసుల్లో స్వాధీనం చేసుకున్న 106 లీటర్ల మద్యం, 30 లీటర్ల సారాయిని అసిస్టెంట్ ఎక్సైజ్ కమిషనర్ రేవతి ఆధ్వర్యంలో కూడేరు పోలీస్‌స్టేషన్‌లో గురువారం ధ్వంసం చేశారు. ఇందులో కూడేరు సీఐ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

● గుత్తి: ఎక్సైజ్, పోలీస్‌స్టేషన్ల పరిధిలో స్వాధీనం చేసుకున్న అక్రమ మద్యం, నాటుసారాను గురువారం ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ ఉమాదేవి తెలిపారు. 48 కేసులలో 294.36 లీటర్ల నాటుసారా, 46 కేసులలో వంద లీటర్ల మద్యం, కర్ణాటక మద్యాన్ని ధ్వంసం చేశామన్నారు.

టీచర్లకు గాయాలు

వజ్రకరూరు (ఉరవకొండ), నవంబరు 13(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలం చాబాల వద్ద గురువారం ఆటో బోల్తా పడిన ప్రమాదంలో ఇద్దరు ఉపాధ్యాయురాళ్లతో పాటు, ఆటో డ్రైవర్ గాయపడ్డారు. చాబాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న రాజేశ్వరి, రెహమత్ బేగం ఆటోలో పాఠశాలకు వెళ్తుంగా.. ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. వీరిద్దరితో పాటు గాయపడ్డ ఆటో డ్రైవర్ అలాబకాష్‌ను ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

భర్త అరెస్టు

కళ్యాణదుర్గం రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోరంపల్లిలో యర్రిస్వామి తన భార్య రత్నమ్మ గొంతు కోసిన విషయం విధితమే. దీంతో యర్రిస్వామిని గురువారం పట్టణ శివారులో అరెస్టు చేసినట్లు సీఐ హరినాథ్ తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించండి

ఉదిరిపికొండ ఉపాధ్యాయులపై డీఈఓ అసహనం



హెచ్‌ఎంతో మాట్లాడుతున్న డీఈఓ

కూడేరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉదిరిపికొండలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను డీఈఓ ప్రసాద్‌బాబు గురువారం సాయంత్రం తనిఖీ చేశారు. తెలుగు, ఇంగ్లీష్ సబ్జెక్ట్‌ల్లో విద్యార్థులు వెనుకబడి ఉన్నట్లు గుర్తించిన ఆయన ఉపాధ్యాయులపై అసహనం వ్యక్తం చేశారు. సక్రమంగా పర్యవేక్షించాలని ప్రధానోపాధ్యాయురాలు హరిశ్రీ పై మండిపడ్డారు. టెన్త్‌లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని సూచించారు. ఆయన వెంట ఏడీ మునీర్‌ఖాన్ ఉన్నారు.

సస్యరక్షణ పద్ధతులతో అధిక దిగుబడులు: జేడీ


ఉరవకొండ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పంట సాగు విధానంలో సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చునని జేడీ ఉమామహేశ్వరమ్మ సూచించారు. మండలంలోని కౌకుంట్లలో జాతీయ నూనె గింజల ఉత్పత్తి పథకంపై కేవీకే రెడ్డిపల్లి వారి ఆధ్వర్యంలో గురువారం శిక్షణ తరగతులు నిర్వహించారు. వేరుశనగ సాగు పద్ధతిని, చీడ పీడల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను కేవీకే శాస్త్రవేత్త మల్లేశ్వరి వివరించారు. పప్పుశనగకు వచ్చే తెగుళ్ల సోకకుండా ముదస్తుగా ట్రైకోడెర్మీతో విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. ఇందులో శాస్త్రవేత్త కిషోర్‌రెడ్డి, ఏడీఏ సత్యనారాయణ, ఏఓ రామకృష్ణ పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్లను తనిఖీ చేసిన ఎస్పీ

యాడికి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ జగదీష్ గురువారం తనిఖీచేశారు. సమస్యాత్మక గ్రామాలు, క్రైం వివరాలపై ఆరాతీశారు. ఆయన వెంట ఏఎస్పీ రోహిత్‌కుమార్‌చౌదరి, సీఐ ఈరన్న, ఎస్ఐ వెంకటరమణయ్య, ఏఎస్ఐలు విజయగౌరీ, వెంకటేష్, అశ్వర్థనారాయణస్వామి ఉన్నారు.

● గుంతకల్లుటౌన్ : స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ తనిఖీ చేశారు. ఆయన వెంట డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు ప్రవీణ్‌కుమార్, మనోహర్, ఏపీ మస్తాన్, మహానంది, ఎస్ఐలు రాఘవేంద్రప్ప, టీపీ వెంకటస్వామి ఉన్నారు.

మండల కన్వీనర్ల ఎంపిక



వన్నారెడ్డి, కాలవ సన్నన్న

కణేకల్లు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల కన్వీనర్‌గా యర్రగుంటకు చెందిన వన్నారెడ్డి ఎంపిక చేస్తూ అధిష్ఠానం నుంచి ఆదేశాలు వచ్చాయని పార్టీ నాయకులు తెలిపారు. శుక్రవారం రాయదుర్గంలో నూతన కన్వీనర్ ప్రమాణస్వీకారం ఉంటుందన్నారు.

● గుమ్మఘట్ట : టీడీపీ మండల కన్వీనర్‌గా కాలవ సన్నన్న ఎంపికయ్యారు. శుక్రవారం మధ్యాహ్నం 74 ఉడేగోళం మద్దానేశ్వర స్వామి దేవాలయంలో ఆయన ప్రమాణస్వీకారం చేస్తారు.

పంటల నమోదు జాబితా ప్రదర్శన

యాడికి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఖరీఫ్‌కు సంబంధించిన పంట నమోదు జాబితాను గురువారం ప్రదర్శించినట్లు ఏఓ మహబూబ్‌బాషా తెలిపారు. రైతులంతా తమ పంట పొలాల సర్వేనెంబర్లు, సాగుచేసిన పంటల వివరాలను సరిచూసుకోవాలని, ఏమైనా ఫిర్యాదులు ఉంటే రైతు సేవా కేంద్రాల్లోని విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.